


అమ్మరూపం.. ఆనందభరితం

జిల్లా వ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం పలు ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. గుంతకల్లు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్వేత వారాహిదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

-న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం

7న కలెక్టరేట్‌లో అర్జీల స్వీకరణ

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఈనెల 7న ఉదయం 10 గంటలకు జిల్లా స్థాయి 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో జరగనుంది. కలెక్టర్ వినోద్‌కుమార్, జిల్లా అధికారులు పాల్గొంటారు. డీఆర్‌డీఏ కార్యాలయంలోనూ అర్జీలు స్వీకరించనున్నారు.

మైనర్లను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ఎస్పీ జగదీశ్ ఆదేశాలతో పోలీసులు శనివారం నగరంలో 'ఆపరేషన్ స్వేచ్ఛ' నిర్వహించారు. అనంతపురం నాలుగో పట్టణ సీఐ సాయినాథ్ పర్యవేక్షణలో ఎస్సై విజయభాస్కర్, అసిస్టెంట్ లేబర్ అధికారి రాధా రమాదేవి, ఉమెన్ ఛైల్డ్ వెల్ఫేర్ ప్రొటెక్షన్ అధికారి చంద్రకళ తనిఖీలు నిర్వహించారు. కళ్యాణదుర్గం రోడ్డు, బళ్లారి రోడ్డు, ఆజాద్‌నగర్, బెంగుళూరు సర్వీస్ రోడ్లకు ఇరువైపులా మెకానిక్, గుజరీ షాపుల్లో తనిఖీలు చేశారు. మైనర్లతో పనులు చేయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్‌లోని బీసీ కాలనీ జలమయం

బొమ్మనహాళ్‌లో భారీ వర్షం

ఖరీఫ్ పంటలకు ఊపిరి.. రబీ సాగుకు అనుకూలం

అనంతపురం (వ్యవసాయం), బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: జిల్లాలో రెండ్రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. శుక్రవారం ఉరుములతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అటు ఖరీఫ్‌లోని సాగైన పంటలకు ఊపిరి పోసింది. రబీలో సాగుకు ఈ వర్షాలు ఎంతో అనుకూలమని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. ఖరీఫ్‌లో 2,80,385 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారు. రబీలో 1,18,477 హెక్టార్లు సాగుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. నల్లరేగడి భూముల్లో పంటల సాగుకు అనుకూలంగా ఉందని అన్నదాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వర్షపాతం ఇలా..: శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. 34.4 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. బొమ్మనహాళ్ మండలంలో 148 మి.మీ (14 సెంమీలు పైగా) వాన పడింది. గార్లదిన్నెలో 75.8, రాయదుర్గం 75.6, పామిడి 62.2, డి.హీరేహాళ్ 59.8, బెళుగుప్ప 56.2, గుత్తి 55.2, విడపనకల్లు 54.6, కణేకల్లు 54.0, కళ్యాణదుర్గం 50.4, శింగనమల 48.5, పెద్దవడుగూరు 40.6, గుమ్మఘట్ట 36.2, ఉరవకొండ 34.2, శెట్టూరు 30.4, కంబదూరు 28.4, వజ్రకరూరు 27.4, గుంతకల్లులో 27.2, బ్రహ్మసముద్రం 22.0, ఆత్మకూరు 19.2, కుందుర్పి 16.6, యాడికి, కూడేరులో 15.4 మి.మీ చొప్పున.. బుక్కరాయసముద్రం, రాప్తాడు, యల్లనూరు, అనంతపురం, నార్పల మండలాల్లో జల్లులు పడ్డాయని జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి అశోకుమార్ తెలిపారు.



బొమ్మనహాళ్ ఆర్ఐ కార్యాలయంలోకి చేరిన నీరు

ఉద్యాన పంటల నష్టం రూ.83.12 లక్షలు

బొమ్మనహాళ్, రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాల్లో ఎక్కువ పంట నష్టం జరిగింది. మొత్తం 133 ఎకరాల్లో రూ.83.12 లక్షల నష్టం జరిగిందని.. మిరప 111 ఎకరాల్లో రూ.71.68 లక్షలు, 22 ఎకరాల్లో టమాటా రూ.11.44 లక్షలు పంట నష్టం జరిగిందని, ప్రాథమిక నివేదిక సిద్ధం చేసి, ప్రభుత్వానికి పంపామని ఉద్యానశాఖ డీడీ నరసింహారావు తెలిపారు బొమ్మనహాళ్ మండలంలో 500 ఎకరాల్లో వరిపొలాలు మునిగాయని, తెరిపిస్తే పంటకు ఎలాంటి ఇబ్బంది ఉండదని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ తెలిపారు.



బొమ్మనహాళ్ మండలం బండూరు వద్ద నీట మునిగిన పంట పొలాలు

ప్రకృతి వ్యవసాయం.. ప్రగతి పథం



- ఏడాది పొడవునా పంటల సాగు
- అందరి చూపు.. రెండు గ్రామాల వైపు

అందరూ చిన్న, సన్నకారు రైతులే. దిగుబడులు రాలేదని దిగాలుగా కూర్చోలేదు. ప్రస్తుత పరిస్థితులను అధిగమిస్తూ.. వినూత్న పంథా ఎంచుకుని విశేషంగా రాణిస్తున్నారు. సేంద్రీయ ఎరువులతో ఏడాది పొడవునా ఆరోగ్యకర పంటలు పండిస్తూ ఆదాయం ఆర్జిస్తున్నారు. ఇతర ప్రాంతాల రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. దేశంలోని పలు ప్రాంతాల నుంచి శాస్త్రవేత్తలు, రైతులు వచ్చి పంటలను పరిశీలించి.. అధ్యయనం చేస్తున్నారు. విభిన్న సాగు విధానాలు తెలుసుకొని మెచ్చుకుంటున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వంద శాతం ప్రకృతి వ్యవసాయంతో ప్రగతి పథంలో సాగుతూ ఆదర్శబాటలో పయనిస్తున్న రెండు గ్రామాలు ఏవీ.. అక్కడి సాగు విశేషాలు ఎలాగున్నాయో తెలుసుకుందాం.



అయిదు అంచెల్లో పంటలు

కళ్యాణదుర్గం, కుందుర్పి, న్యూస్‌టుడే

కుందుర్పి మండలం తమ్మయ్యదొడ్డి గ్రామంలో సుమారు 53 ఇళ్లు ఉన్నాయి. మొత్తం 250 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. 47 మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ సామూహిక ప్రకృతి వ్యవసాయం (ఏపీజీఎన్ఎఫ్) పేరుతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తోంది. ఎనిమిదేళ్ల క్రితం అప్పటి తెదేపా ప్రభుత్వ హయాంలోనే ప్రకృతి వ్యవసాయం దిశగా అడుగులు వేశారు. ఇక్కడ ఐదు అంచెల్లో పంటలు పండిస్తూ అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు. ఐదు అంచెలు అంటే.. పెద్ద, చిన్న, దాని కంటే చిన్న ఇలా రకరకాల ఎత్తులో ఉద్యాన మొక్కలను నాటి.. వాటి మధ్యలో అంతర పంటలు సాగు చేయడం. ఖరీఫ్ సీజన్‌లో మామిడి, నేరేడు, ఉసిరి, కంది, వేరుసెనగ, ఆముదం తదితరాలు నాటుకుని సంవత్సరం అంతా పండించే విధానం. ఇందుకు ఏఎఫ్ ఎకాలజీ ప్రోత్సహించింది. ప్రస్తుతం 'ఏటీఎం' పేరుతో అర ఎకరాలో కూరగాయలు సాగు చేస్తున్నారు. ఇంటి అవసరాలకుపోనూ మిగిలినవి మార్కెట్‌కు తరలిస్తూ లాభాలు గడిస్తున్నారు. బోర్లు ఉన్న రైతులు తమలపాకు, వరి, రాగి, జొన్న, సజ్జలు, కూరగాయలు తదితర పంటలు పండిస్తున్నారు.

ప్రతినెలా తమలపాకులతో ఆదాయం

- చంద్రశేఖర్, రైతు



ఐదెకరాల్లో బోరు కింద నాలుగు రకాల పంటలు సాగు చేస్తున్నా. 1.50 ఎకరాల్లో తమలపాకు, వక్క, రెండు ఎకరాల్లో టమాటా.. 1.50 ఎకరాల్లో మామిడి చెట్లు పెట్టుకున్నా. చెరువు మట్టి, జీవామృతం, కషాయాలు వేసుకుని పూర్తిస్థాయి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నా. కూలీలు, కషాయాలు తదితరాలకు ఏడాదికి రూ.2లక్షల వరకు పెట్టుబడి వస్తుంది. తమలపాకులోనే నెలకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఆదాయం వస్తుంది.

వర్షాధారంగా ..

- నీలమ్మ, రైతు



మొత్తం 2.50 ఎకరాల పొలం ఉంది. వర్షాధారంగా పంటలు సాగు చేస్తున్నా. ఏఎఫ్ ఎకాలజీ సిబ్బంది మామిడి, ఉసిరి, పనస, చింత మొక్కలు ఇచ్చారు. వాటి మధ్యలో వేరుసెనగ, కంది, పెసర సాగు చేస్తున్నా. ఏడాది పొడవునా ఆదాయం వస్తుంది. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూనే సాగులో విభిన్న పద్ధతులు నేర్పుతోంది.



ఉగ్రేపల్లిలో సాగు చేసిన పంటలు

మడకశిర, న్యూస్‌టుడే: మడకశిర మండలం ఉగ్రేపల్లి గ్రామంలో 82 కుటుంబాలు ఉన్నాయి. 126 మంది రైతులు 180 ఎకరాల్లో వంద శాతం ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. వర్షాధారంగా రాగి, వేరుసెనగ, మామిడి, మొక్కజొన్న, పూలతోటలు, బెండ, ఆకుకూరలు, వంకాయ, టమాటా, ముల్లంగి, క్యారెట్ తదితర పంటలు పండిస్తున్నారు. మార్కెట్‌లో కూరగాయలకు డిమాండ్ ఉంది. ప్రకృతి వ్యవసాయం చేసినప్పటి నుంచి భూములు సారవంతంగా మారుతున్నాయని రైతులు చెబుతున్నారు.

మార్కెట్‌లో మంచి గిరాకీ

- జంపన్న, రైతు



మూడు ఎకరాల పొలం ఉంది. మామిడి, చింత సాగు చేసి రూ.1.50 లక్షలు ఆదాయం పొందాను. ప్రస్తుతం 15 సెంట్లలో పూలు, ముల్లంగి, క్యారెట్, బీట్‌రూట్, వంగ, మిరప, టమాటా, కంది సాగు చేయగా రూ.60వేలు ఆదాయం వచ్చింది. సేంద్రీయ ఎరువులతో పండించిన కూరగాయలకు మార్కెట్లో మంచి గిరాకీ ఉంది.

ఎరువుల అంగడి.. అన్నదాతల నుంచి అదనంగా వసూలు ధరల గారడీ



ఈనాడు, అనంతపురం: వ్యాపారుల అత్యాశ.. అధికారుల నిర్లక్ష్యం వెరసి రైతులు నష్టపోతున్నారు. హోల్‌సేల్ ఎరువుల వ్యాపారులు ఒక్కో బస్తాపై రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారు. దీంతో రిటైల్ వ్యాపారులు రైతులపై మరో రూ.50 భారం మోపుతున్నారు. ఫలితంగా ఒక్కో ఎరువుల బస్తాపై రైతులు రూ.100 వరకు అదనంగా చెల్లిస్తున్నారు. ఫిర్యాదులు చేస్తున్నా వ్యవసాయశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని రైతులు వాపోతున్నారు. రైతులకు విక్రయించే ఎరువులపై కేంద్రం ప్రభుత్వం రాయితీ ఇస్తోంది. రాయితీ పోగా కంపెనీలు ఎంఆర్‌పీని నిర్ణయిస్తాయి. నిర్ణీత ధరకే విక్రయించాల్సి ఉంటుంది. కొందరు వ్యాపారులు అదనంగా వసూలు చేస్తున్నా వ్యవసాయశాఖ పట్టించుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

అనంతపురం జిల్లాలో ఇలా..

ఎరువు రకం	అవసరం (టన్నుల్లో)	ప్రస్తుత నిల్వ (టన్నుల్లో)
యూరియా	25,994	7,580
డీఏపీ	9,455	3,700
ఎన్‌పీకే	37,908	21,464

అప్పును ఆసరాగా తీసుకుని..

సాధారణంగా రైతులు ఏటా వ్యాపారుల నుంచి ఎరువులను అప్పుగా తీసుకుంటారు. పంట విక్రయించిన తర్వాత తిరిగి చెల్లిస్తుంటారు. డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులకు పెద్దమొత్తంలో ఖర్చవుతుంది. చిన్న, సన్నకారు రైతులు వ్యాపారుల వద్ద ఖాతా తెరిచి అవసరమైనప్పుడల్లా ఎరువులను అప్పుగా తీసుకెళ్తుంటారు. దీన్ని ఆసరాగా తీసుకుని రైతుల నుంచి కొందరు వ్యాపారులు అదనంగా వసూలు చేస్తున్నారు. హోల్‌సేల్ వ్యాపారులు సైతం రిటైలర్ల నుంచి అదనంగా వసూలు చేస్తున్నారు. బిల్లుల్లో మాత్రం నిర్దేశిత ధరలు రాస్తున్నారు. ప్రస్తుతం వానలు కురవడంతో రబీ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. అదును దాటితే పంట దిగుబడి తగ్గిపోతుందనే భయంతో వ్యాపారులు చెప్పిన ధరకే కొనుగోలు చేస్తున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు

శివనారాయణశర్మ, జేసీ, అనంతపురం

నిర్దేశిత ధరలతోనే ఎరువులు విక్రయించాల్సి ఉంటుంది. అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. జిల్లా వ్యవసాయాధికారితో విచారణ జరిపిస్తాం. అదనంగా వసూలు చేసినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటాం. రైతులు నేరుగా మాకు ఫిర్యాదు చేయవచ్చు. కొనుగోలు చేసే ప్రతి రైతు బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి.

కృత్రిమ కొరత సృష్టించి..

అనంతపురం జిల్లాలో రబీ సీజన్ సంబంధించి మార్చి వరకు యూరియా, డీఏపీతో పాటు ఇతర ఎరువులు కలిపి 80,920 మెట్రిక్ టన్నులు అవసరమని తేల్చారు. యూరియా 25,994 టన్నులు, డీఏపీ, 9455 టన్నులు అవసరమవుతాయని అధికారులు చెబుతున్నారు. అక్టోబరులో 26 వేల టన్నులు అవసరం. ప్రస్తుతం జిల్లాలో 39 వేల టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. హోల్‌సేల్ వ్యాపారులు స్టాక్ లేదని.. ధరలు పెంచి అమ్ముతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ఉద్దేశపూర్వకంగానే కృత్రిమ కొరత సృష్టించి.. సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. యూరియా బస్తా రూ.265కు విక్రయించాల్సి ఉండగా.. రూ.310 వరకు వసూలు చేస్తున్నారు. డీఏపీ రూ.1350కు గాను రూ.1450కు అమ్ముతున్నారు. ఒక్కో బస్తాపై రూ.50 నుంచి రూ.100 వరకు వసూలు చేయడంతో ఒక్కో రైతుపై రూ.500 నుంచి రూ.1000 వరకు అదనపు భారం పడుతోంది.



నూతన కార్యవర్గ సభ్యులు

వీఆర్ఏల సంఘం కొత్త కమిటీ ఎంపిక

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం (వీఆర్ఏ) జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేసుకున్నారు. శనివారం కృష్ణకళ మందిరం రెవెన్యూ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఆ సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా వీఆర్ఏల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గరికపాటి బ్రహ్మయ్య, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ఎన్ దివాకర్‌రావుల సారథ్యంలో ఈ కమిటీ ఎంపిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా శింగనమల ఓబిలేసు, ప్రధాన కార్యదర్శిగా యాడికి నాగరాజు, జిల్లా కోశాధికారిగా గుమ్మఘట్ట విజయ, సహాధ్యక్షుడిగా గార్లదిన్నె సీతారం, ఉపాధ్యక్షులుగా గార్లదిన్నె తలారి నాగరాజు, బాల ఓబిలేసు, సందీప్, ఎర్రిస్వామి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

అధునాతన మీటర్లు కొత్త ఫీచర్లు

- ఉమ్మడి జిల్లాలో విద్యుత్తు సర్వీసులకు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు
- మొదటి విడతగా ప్రభుత్వ సర్వీసులకు
- తర్వాత నియంత్రికలు, ఫీడర్లకు..

- ఉమ్మడి జిల్లాలో ఏర్పాటు చేయనున్న మొత్తం స్మార్ట్‌మీటర్లు: 2,92,811
- ఉపకేంద్రాల్లో 33కేవీ ఫీడర్ల వద్ద : 187
- ఉపకేంద్రాల్లో 11కేవీ ఫీడర్ల వద్ద : 1056
- అధిక సామర్థ్యం గల నియంత్రికల వద్ద: 11396
- ప్రభుత్వ కార్యాలయాలు : 29,525
- పరిశ్రమల సర్వీసులు : 14,484
- వాణిజ్య సర్వీసులు: 1,20,459
- 220 యూనిట్ల కంటే ఎక్కువగా వినియోగించే గృహ సర్వీసులకు బిగించనున్న మీటర్ల సంఖ్య : 1,16,203

అనంతపురం (విద్యుత్తు), న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగంలో ఇక స్మార్ట్‌ఫోన్ల వాడుక పెరగనుంది. తమ సెల్‌లోనే మొబైల్ యాప్ ద్వారా తమ విద్యుత్తు సర్వీసుకు ఎంత మొత్తం కావాలంటే అంత రీఛార్జ్ చేసుకోవచ్చు. స్మార్ట్ మీటర్లకు సెల్‌ఫోన్ అనుసంధానంతో మరిన్ని ప్రయోజనాలు ఒనగూరనున్నాయి.

- ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయ మీటర్లు మినహా అన్ని కేటగిరీ సర్వీసులు మొత్తంగా 2,92, 811 సర్వీసులకు స్మార్ట్ మీటర్లను బిగించేందుకు ఎస్పీడీసీఎల్ చర్యలు తీసుకుంది. మొదటి విడతగా జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల సర్వీసులకు స్మార్ట్‌మీటర్లను బిగిస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 2 వేల సర్వీసులకు స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియను పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. మొదటి విడతగా 200 యూనిట్లు వినియోగంపై ఉన్న గృహ సర్వీసులకు, వాణిజ్య, పరిశ్రమల సర్వీసులతోపాటు ఉపకేంద్రాల్లో ఉన్న 11 కేవీ, 33 కేవీ ఫీడర్లకు, అధిక సామర్థ్యం గల నియంత్రికల వద్ద స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేసేందుకు శ్రీకారం చుట్టారు.

ఉపయోగాలెన్నో..

స్మార్ట్‌మీటర్ ఏర్పాటు ద్వారా విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతాయని విద్యుత్తు అధికారులు తెలుపుతున్నారు. విద్యుత్తు బిల్లులు చెల్లించేందుకు విద్యుత్తు కార్యాలయాలకు వద్దకు వెళ్లి క్యూలో నిల్చుని బిల్లులు కట్టాల్సిన పని ఉండదు. తమ సెల్ ఫోన్‌లో ఎస్పీడీసీఎల్ రూపొందించే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అందులో తమ విద్యుత్తు సర్వీసు నంబరును నమోదు చేసుకుని కట్టవచ్చు. వినియోగదారులు తాము ఎంత మొత్తం రీఛార్జి చేసుకుంటే అంత మొత్తం అయిపోయే వరకు సరఫరా ఉంటుంది. పూర్తైన తరువాత వెంటనే సరఫరా ఆగిపోకుండా కొంత సమయం వరకు వెసులుబాటు ఉంటుంది. రీఛార్జీ గడువు ముగిసే సమాచారం కూడా ముందస్తుగా వినియోగదారు సెల్ నంబరుకు సంక్షిప్త సమాచారం వస్తుందని వెల్లడిస్తున్నారు.

- ఎప్పటికప్పుడు మొబైల్ యాప్ ద్వారా తమకున్న విద్యుత్తు సర్వీసుకు రీఛార్జి చేసుకునే సౌకర్యం ఉంటుందని దీనివల్ల అపరాధ రుసుం చెల్లించే పరిస్థితి ఉండందంటున్నారు. మీటర్ రీడింగ్ తీసే సమయంలో తప్పులు దొర్లే పరిస్థితి ఉండదని చెబుతున్నారు.
- స్మార్ట్‌మీటర్‌లో ఏర్పాటు చేసిన ఇన్ బిల్ట్ సిమ్ ద్వారా ఎప్పటికప్పుడు మీటర్‌లో రికార్డు అయ్యే మొత్తం సమాచారం ఆన్‌లైన్ ద్వారా చూసుకునే వీలుంటుంది. ఎన్ని యూనిట్లు వినియోగం జరిగింది, ఎంత రీఛార్జి చేశారు. ఎప్పుడు రీఛార్జి గడువు ముగిసింది.. వంటి పూర్తి వివరాలు నిక్షిప్తం కావటంతోపాటు ఆన్‌లైన్‌లో చూసుకునే వీలుంటుందని అధికారులు పేర్కొన్నారు.
- 11కేవీ, 33 కేవీ ఫీడర్లు, అధిక సామర్థ్యం గల నియంత్రికల వద్ద స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేయటం వల్ల ఎంత విద్యుత్తు సరఫరా అవుతోంది. వినియోగం, వృథా ఎంత వంటి వివరాలు ఆయా మీటర్లలో ఉన్న సిమ్‌లలో నిక్షిప్తం అవుతుందని అధికారులు వెల్లడిస్తున్నారు. ఫీడర్, నియంత్రికలపై హెచ్చు, తగ్గులు సరఫరా అవుతున్నా యాప్‌లో నమోదు అవుతుంది.



ప్రభుత్వ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్మార్ట్‌మీటర్

బిగింపు ప్రక్రియ జరుగుతోంది

- సంపత్‌కుమార్, ఎస్ఈ, విద్యుత్తుశాఖ

మీటర్ల బిగింపు ప్రక్రియను జులై 2025 లోపు పూర్తిచేయాలని ఒప్పందం మేరకు ఉమ్మడి జిల్లాలో మొదటగా ప్రభుత్వ కార్యాలయాలకు, తర్వాత అన్ని కేటగిరీల సర్వీసులకు మీటర్లను బిగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రక్రియ పూర్తైతే వినియోగదారులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయి. బిగింపు పూర్తైన తరువాత ఎలాంటి ఫీచర్స్‌ను అందుబాటులోకి తీసుకు వస్తారన్న పూర్తి సమాచారం వస్తుంది. ఎలా సద్వినియోగం చేసుకోవాలన్న అంశంపైనా వినియోగదారులందరికీ అవగాహన కల్పిస్తాం.

అక్రమార్కుల గుండెల్లో గుబులు

సాధారణ పరీక్షల విభాగంలో నిధుల స్వాహాపై విచారణ

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: విద్యాశాఖ సాధారణ పరీక్షల విభాగంలో రూ.లక్షలు నిధులు స్వాహా చేసినట్లు ఆరోపణలున్నాయి. దుర్వినియోగంపై ఏప్రిల్‌లో 'ఈనాడు'లో 'పరీక్షల విభాగంలో నిధుల స్వాహా' శీర్షికన కథనం వెలువడింది. అప్పట్లో రూ.16 లక్షలు దుర్వినియోగం అయినట్లు విమర్శలు వచ్చాయి. సుమారు రూ.30 లక్షల వరకూ నిధులు పక్కదారి పట్టినట్లు తెలుస్తోంది. ఈ బాగోతంపై విద్యాశాఖ ఆర్జేడీ శామ్యూల్ విచారణకు ఓ బృందాన్ని నియమించారు. ఈ బృందంలో చిత్తూరు జిల్లా విద్యాశాఖ ఏడీ వెంకటేశ్వరరావు, వైఎస్ఆర్ జిల్లా విద్యాశాఖ పర్యవేక్షకులు కుమార్, గుత్తి ఉపవిద్యాశాఖ అధికారి శ్రీదేవి ఉన్నారు. ఆ బృందం విచారణ ప్రారంభించింది.

★ ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సమ్మెటివ్, ఫార్మేటివ్ పరీక్షల ప్రశ్నపత్రాలు, ఓఎమ్మార్ షీట్లు సాధారణ పరీక్షల విభాగం అందిస్తుంది. ఇందుకు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు రుసుం చెల్లిస్తారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు జిల్లా సాధారణ పరీక్షా మండలికి జమచేస్తారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం 'అనంత సంకల్పం' పేరుతో పాఠ్యసామగ్రి సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచాలనే ఉద్దేశంతో నిపుణులతో రూపొందించిన స్టడీ మెటీరియల్ కొన్నేళ్లు ఉచితంగా ఈ విభాగం అందిస్తోంది. 2023-24 విద్యాసంవత్సరంలో మెటీరియల్ అరకొరగానే సరఫరా చేశారు. పాఠశాలలో 100 మంది విద్యార్థులుంటే 30, 40 సెట్లు మాత్రమే అందించారు. కొన్ని పాఠశాలలకు అనంత సంకల్పం మెటీరియల్ అందలేదని అప్పట్లో కొందరు ఉపాధ్యాయులు విమర్శలు చేశారు. ఈ మెటీరియల్ ముద్రణలో అక్రమాలు జరిగినట్లు సమాచారం. టెండర్లు లేకుండానే ముద్రణ చేయించారని, కమీషన్ల రూపంలో రూ.లక్షలు దండుకున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

ఆర్జేడీకి నివేదిక సమర్పిస్తారు

- వరలక్ష్మి, డీఈవో, అనంతపురం

త్రిసభ్య బృందం విచారణ చేశారు. ఆ బృందం ఆర్జేడీకి నివేదిక సమర్పిస్తారు. నివేదిక ఆధారంగా తగిన నిర్ణయం తీసుకుంటారు. డిప్యూటీ డీఈవో పదవి నుంచి తప్పించాలని కోరిన విషయం వాస్తవమే. ఎందుకు పదవి నుంచి తప్పుకోవాలనుకున్నారో తెలియదు.

పర్యావరణంతో ప్రజారోగ్యం పదిలం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్



కోర్టు ఆవరణలో చెత్త తొలగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్, పోక్సో కోర్టు న్యాయమూర్తి రాజ్యలక్ష్మి

అనంతపురం(లీగల్), న్యూస్‌టుడే: నిత్యం ఇరువర్గాల వాదనలను పరిశీలించి తీర్పులను ఇచ్చే న్యాయమూర్తులు పరిశుభ్రతకు నడుం కట్టారు. చీపుర్లు పట్టి కోర్టు ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించారు. చెత్తాచెదారాన్ని ఎత్తివేశారు. నిత్యం కక్షిదారులతో కిటకిటలాడే కోర్టు ఆవరణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, నగర పాలక సిబ్బంది, పోలీసులు అందరూ కలిసి స్వచ్ఛ హీ సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం పరిసరాలను శుభ్రం చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని అన్నారు. తాము నివసిస్తున్న ప్రాంతంతోపాటు పని చేసే ప్రాంతాన్ని కూడా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా అదనపు న్యాయమూర్తులు రాజ్యలక్ష్మి, సాధు బాబు, హరిత, న్యాయమూర్తులు శివప్రసాద్ యాదవ్, శంకర్‌రావు, సుజిన్‌కుమార్, శివశంకర్, నగరపాలక కమిషనర్ నాగరాజు, డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, న్యాయవాదులు రామలింగారెడ్డి, నారాయణరెడ్డి, ఉమాపతి పాల్గొన్నారు.

సరస్వతీ నిలయంలో విజ్ఞాన భాండాగారం

బండ్లపల్లి ప్రభుత్వ బడికి హుండాయ్ ట్రాన్సిస్ సంస్థ చేయూత



గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: దీపం వెలుగులో సైతం పుస్తకాలు చదువుకున్న ఎందరో మహనీయులు చరిత్ర సృష్టించారు. పుస్తకాల విలువను గుర్తించిన హుండాయ్ ట్రాన్సిస్ కార్పొరేట్ కంపెనీ అక్షరాల సాక్షిగా రూ.లక్షల విలువ చేసే పుస్తకాల భాండాగారాన్ని సరస్వతీ బిడ్డల కోసం కానుకగా ఇచ్చింది. ఆ అదృష్టం చేసుకున్న సరస్వతీ నిలయం కొత్తచెరువు మండలంలోని బండ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. విద్యార్థినేస్తాల అక్షరాభిరుచిని తెలుసుకున్న కంపెనీ ప్రతినిధులు అధునాతన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి విద్యార్థుల భవితకు బాటలు వేశారు.

చుట్టూ పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణంలో చదువుల బడి, క్రమశిక్షణతో కూడిన విద్యార్థులు, క్రీడల్లో రాష్ట్రస్థాయిలో బహుమతులు పొందిన మట్టిలో మాణిక్యాలు. బహుశా ఇవన్నీ హుండాయ్ కంపెనీ ప్రతినిధులను ఆకర్షించాయేమో.. కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబిలిటీ (సి.ఎస్.ఆర్) కింద ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. హుండాయ్ ట్రాన్సిస్ కంపెనీ ఎం.డి.షాంకిల్ జంగ్, సి.హెచ్.ఓ బైంగ్సన కాంగ్, జీఎం కళాసాగర్‌రెడ్డిల ఆధ్వర్యంలో రూ.15 లక్షల వ్యయంతో వందల పుస్తకాలు, ఫర్నీచర్, ఫ్యాన్లు, కుర్చీలు, ర్యాక్‌లతో అధునాతన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. భాగవత, రామాయణ, మహాభారత, భగవద్గీత వంటి పురాణ ఇతిహాసాలే కాకుండా.. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, ఆంగ్ల వ్యాకరణం, కథలు, స్ఫూర్తిని పెంచే మహనీయుల జీవిత కథలు, పెద్దబాల శిక్షలు.. తెలుగు సాహితీమూర్తుల జీవిత చరిత్రలు వంటి ఎన్నో వందల పుస్తకాలను అందుబాటులో ఉంచారు. అలాగే హిందూపురంలో కూడా కంపెనీ సెక్రెటరీ అరుణ్‌రెడ్డి నేతృత్వంలో ఈ కార్యక్రమం కింద 13 మున్సిపల్ పాఠశాలల్లో ఆధునికీకరణ పనులు చేపట్టారు.




గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న హుండాయ్ ట్రాన్సిస్ ఎండీ షాంగ్‌కిల్ జంగ్, కియా సీపీఓ గైసుంగ్ కిమ్

ఇది మాకు దేవాలయం



పుస్తక ప్రపంచాన్ని మాకు అందించిన ట్రాన్సిస్ కంపెనీ ప్రతినిధులకు ధన్యవాదాలు. గ్రంథాలయంలో పుస్తకాలు చదివి ఎన్నో కొత్త విషయాలు తెలుసుకుంటున్నాం. గొప్పవారి జీవిత కథలు చదవడం ద్వారా స్ఫూర్తి పొంది క్రమశిక్షణను అలవరచుకుంటున్నాం. అందుకే ఈ గ్రంథాలయం మాకు దేవాలయం లాంటిది. **- పరిమళ, 10వ తరగతి**

విద్యార్థులు అదృష్టవంతులు



రూ.15 లక్షలతో వందల పుస్తకాలతో అధునాతన గ్రంథాలయాన్ని మా పాఠశాలకు అందించిన హుండాయ్ ట్రాన్సిస్ కంపెనీ ప్రతినిధులకు మా పాఠశాల ఎప్పటికీ రుణపడి ఉంటుంది. పుస్తకాలు కొనలేని పేద విద్యార్థులకు ఈ గ్రంథాలయం ఒక వరం లాంటిది. ఈ సువర్ణవకాశం పొందిన విదార్థులు అదృష్టవంతులు. **- కె.వెంకటరమణ, ప్రధానోపాధ్యాయుడు**

ఏడీసీఏ గ్రామీణ క్రికెట్ పోటీల్లో ధర్మవరం విజయం



హస్విత



కార్తీక

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆర్డీటీ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్రామీణ క్రికెట్ లీగ్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. శనివారం పట్టణంలోని ఆర్డీటీ క్రికెట్ మైదానంలో జరిగిన పోటీల్లో బాలికల అండర్-16 విభాగంలో హిందూపురం, ధర్మవరం జట్లు తలపడ్డాయి. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన హిందూపురం జట్టు నిర్ణీత 30 ఓవర్లలో 165 పరుగులు చేసింది. కార్తీక 77 పరుగులతో రాణించింది. అనంతరం బరిలో దిగిన ధర్మవరం బాలికల జట్టు కేవలం 19 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ధర్మవరం జట్టులో హస్విత 55 పరుగులు చేసి జట్టును గెలిపించింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో 18 జట్లు పాల్గొంటున్నాయని శిక్షకుడు రాజశేఖర్, ఆర్డీటీ ఏటీఎల్ శ్రీనివాసులు తెలిపారు.

ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యం : మంత్రి సవిత



మాట్లాడుతున్న బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత

పెనుకొండ పట్టణం, న్యూస్‌టుడే : రానున్న ఐదేళ్లలో రాష్ట్రంలో నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో ఉచిత డీఎస్సీ శిక్షణ కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన రోజు 16,457 ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీకి మెగా డీఎస్సీపై సంతకం చేశారని గుర్తుచేశారు. బడుగు, బలహీన వర్గాల పోటీ పరీక్షల్లో సత్తా చాటాలన్న ఉద్దేశంతో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అందులో భాగంగా పెనుకొండలో కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. 2 నెలలపాటు ఉచిత శిక్షణతోపాటు అభ్యర్థులకు ఒక్కొక్కరికి నెలకు రూ.1,500, పుస్తకాలకు రూ.1,000 అందిస్తామన్నారు. బీసీ స్టడీ సర్కిళ్లు బలోపేతం చేసి అన్ని పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. భవిష్యత్తులో నోటిఫికేషన్లతో సంబంధం లేకుండా అన్ని రకాల ఉద్యోగాల పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు డీఎస్సీలో సత్తాచాటి అత్యధికంగా జిల్లా నుంచి ఉద్యోగాలకు ఎంపికవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మలజ్యోతి, ఏబీసీడబ్ల్యూ గంగాధర్, ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ కె.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే : జిల్లాలో బిందు, తుంపర సేద్యం పథకం 37,500 హెక్టార్లకు మంజూరైంది. రైతు వాటా చెల్లించిన రైతులకు పరికరాలు కంపెనీలు సరఫరా చేస్తున్నాయి. సకాలంలో రైతు పొలాల్లో పరికరాలు అమర్చేందుకు పిట్టర్ల కొరత ఎక్కువగా ఉంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పదో తరగతి ఉత్తీర్ణత, ఆసక్తి సాధించిన విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చి అవకాశాలు కల్పిస్తున్నామని ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి తెలిపారు. ఈనెల 15లోపు నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకోవాలని పీడీ కోరారు. సమాచారం, సందేహాల నివృత్తి కోసం అనంతపురంలోని రైతు బజారు ఆవరణలో ఉన్న ఏపీఎంఐపీ కార్యాలయంలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

జడ్పీ ఉప సీఈఓగా వెంకటసుబ్బయ్య బాధ్యతల స్వీకారం



జడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మను కలిసిన ఉప సీఈఓ వెంకటసుబ్బయ్య

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జిల్లా ప్రజాపరిషత్తు నూతన ఉప సీఈఓగా జి.వెంకట సుబ్బయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత జడ్పీ ఛైర్ పర్సన్ బి.గిరిజమ్మ, కలెక్టర్ వినోద్‌కుమార్‌లను మర్యాద పూర్వకంగా కలిసిన తర్వాత లాంఛనంగా బాధ్యతలు స్వీకరించారు. కడప డీఎల్‌డీఓగా ఉన్న ఆయనను ఇటీవల జరిగిన బదిలీలో అనంతపురం జడ్పీ ఉప సీఈఓగా ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం ఉప సీఈఓగా ఉన్న లలితాబాయిని అనంతపురం డీఎల్‌డీఓగా బదిలీ చేసిన విషయం తెలిసిందే. కడప జిల్లాలోని వివిధ మండలాల్లో ఎంపీడీఓగా ఆయన 22 ఏళ్లకు పైగా పనిచేశారు. రెండేళ్ల క్రితం డీఎల్‌డీఓగా పదోన్నతి లభించింది. ప్రస్తుతం సీఈఓ పోస్టు కూడా ఖాళీగా ఉన్నందున ఇకపై జడ్పీ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉంది. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పాలకవర్గాన్ని సమన్వయం చేసుకుని జడ్పీని ప్రగతి బాటలో నడిపించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. జడ్పీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటనారాయణ, పలువురు ఎంపీడీఓలు, ఏఓలు, ఆయనను అభినందించారు.

రాష్ట్రస్థాయి పారా క్రీడాపోటీల్లో జిల్లాకు మూడు పతకాలు

అనంతపురం (క్రీడలు), న్యూస్‌టుడే: విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పారా క్రీడాపోటీల్లో జిల్లాకు మూడు పతకాలు లభించాయి. జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన మోహన్ కృష్ణ తన ఫ్రీస్టైల్ విభాగంలో పోటీ పడి పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. ఈతలో ఈ క్రీడాకారుడు రెండు పతకాలు చేజిక్కించుకోవడం విశేషం. పారా రైఫిల్ షూటింగ్‌లో వెంకట రమణ పసిడి పతకంతో మెరిశాడు. పతకాలతో తిరిగొచ్చిన పారా క్రీడాకారులను జిల్లా క్రీడల అభివృద్ధి ఇన్‌ఛార్జి అధికారి అనిల్‌కుమార్ అభినందించారు. జాతీయ స్థాయి పారా క్రీడల్లో కూడా రెట్టింపు ఉత్సాహంతో ఆడి పతకాలతో తిరిగి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

టమాటా ధరలు తగ్గుముఖం

అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం గ్రామీణం కక్కలపల్లి మార్కెట్‌లో 4 రోజులుగా టమాటా ధరలు తగ్గుముఖం పట్టాయి. జిల్లా అంతటా ఆకాశం మేఘావృతం కావడం, రెండ్రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో టమాటా కాయలకు మచ్చలు వచ్చే అవకాశం ఉందని, వర్షానికి తడిసే కాయలు నాణ్యత తగ్గి, రవాణాకు పనికి రాకుండా పోతాయని వ్యాపారులు తెలిపారు. కొనుగోలుదారులు ముందుకు రాకపోవడంతో ధరలు అమాంతంగా పడిపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మూడ్రోజుల క్రితం టమాటా కిలో రూ.77 ఉండగా శనివారం కిలో రూ.51 పడిపోయింది. కిలో టమాటాపై రూ.20-26 తగ్గింది. మార్కెట్‌కు శనివారం మొత్తం 675 టన్నులు వచ్చాయి. ధరలు పరిశీలిస్తే కిలో టమాటా గరిష్ఠం రూ.51, మధ్యస్థం రూ.40, కనిష్ఠం రూ.27 పలికింది. అదే 15 కిలో బుట్ట ధర రూ.గరిష్ఠం రూ.765, మధ్యస్థం రూ.600, కనిష్ఠం రూ.405 పలికిందని మార్కెట్ ఇన్‌ఛార్జి రాంప్రసాద్‌రావు తెలియజేశారు.

అత్యాచార నిందితుడిపై పోక్సో కేసు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్సై వెంకటనారాయణ

అమడగూరు, న్యూస్‌టుడే: బాలికపై ఏడాది నుంచి అత్యాచారం చేయడంతోపాటు గర్భం దాల్చడానికి కారణమైన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు పుట్టపర్తి మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో డీఎస్పీ వివరించారు. అత్యాచార సంఘటనకు సంబంధించి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మండలంలోని ఒక గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలిక అమడగూరు పాఠశాలలో చదువు కోవడానికి వచ్చేది. అదే గ్రామానికి చెందిన యువకుడు కూడా పాఠశాల సమీపంలోనే చిల్లర దుకాణం నిర్వహించేవాడు. బాలికకు వరుసకు అన్న అయిన ఈ యువకుడు తినుబండారాలు ఇస్తూ లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. ఏడాది నుంచి తరచూ లైంగికదాడికి పాల్పడుతుండేవాడు. అమ్మాయికి నాలుగు రోజుల కిందట కడుపు నొప్పి రావడంతో తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం కర్ణాటకకు తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి ప్రస్తుతం మూడు మాసాల గర్భిణి అని నిర్ధారించడంతోపాటు కర్ణాటక పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు అమడగూరు పోలీసులు, ఎస్పీకి సమాచారం అందజేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధితురాలిని బాలిక సంరక్షణ కేంద్రానికి (సీడబ్ల్యూసీ) తరలించారు. సమావేశంలో ఎస్సై వెంకటనారాయణ పాల్గొన్నారు.

సైబర్ మోసగాళ్ల టోకరా

సోమందేపల్లి, న్యూస్‌టుడే : సోమందేపల్లిలో నివాసం ఉంటున్న ఓ మహిళ సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయింది. గుంతకల్లు ప్రాంతానికి చెందిన ఆమె భర్త కియా అనుబంధ పరిశ్రమలో పనిచేస్తున్నారు. వారు సోమందేపల్లిలో నివాసం ఉంటున్నారు. చరవాణి యాప్ ద్వారా పరిచయమైన మహిళ మూడింతల సొమ్ము అందిస్తామని ఆమెకు తెలిపింది. సోమందేపల్లికి చెందిన మహిళ రూ.3 లక్షలు సొమ్మును ఫోన్‌పే ద్వారా పంపి.. తన ఖాతాకు రూ.9 లక్షలు మొత్తం జమ చేస్తారని ఎదురుచూసింది. మూడు రోజులైనా ఎలాంటి సమాధానం రాకపోవడంతో చివరకు తాను మోసపోయినట్లు గుర్తించి శుక్రవారం పోలీసులను ఆశ్రయించింది. సొమ్ము తిరుపతిలోని ఖాదికాలనీలో ఉన్న కరూర్ వైశ్యా బ్యాంకులో అరక్ విజయ్‌శరత్ వ్యక్తి ఖాతాకు చేరినట్లు గుర్తించినట్లు బాధిత దంపతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని వారు పోలీసులను వేడుకున్నారు.

ట్రాక్టర్ బోల్తా.. ఇద్దరు యువకుల దుర్మరణం

ముప్పలకుంటలో విషాదం



వన్నూరుస్వామి



లక్ష్మీకాంత్

బ్రహ్మసముద్రం, న్యూస్‌టుడే: ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడి ఇద్దరు యువకులు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన శుక్రవారం అర్ధరాత్రి బ్రహ్మసముద్రం మండలం ముప్పలకుంట గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థుల వివరాల మేరకు.. బొజ్జప్ప, తమ్మక్కల కుమారుడు లక్ష్మీకాంత్(19), గోవిందప్ప, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు వన్నూరుస్వామి(21), మరో యువకుడు ధనుష్ స్నేహితులు. లక్ష్మీకాంత్, వన్నూరుస్వామి గొర్రెలు, మేకలు మేపుకొనేవారు. శుక్రవారం జీవాలను మేపుకొని ఇంటికి వచ్చారు. రాత్రి భోజనం చేశాక ముగ్గురు కలిసి బొజ్జప్ప అనే రైతు తోటలో సేద్యం చేసేందుకు ట్రాక్టర్ తీసుకువెళ్లారు. రోటావేటర్‌తో సేద్యం చేస్తుండగా భారీ వర్షం కురిసింది. పని మధ్యలోనే ఆపేసి ట్రాక్టరులో ఇంటికి వస్తుండగా ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా పడింది. వన్నూరుస్వామి, లక్ష్మీకాంత్ ట్రాక్టర్ కిందపడి అక్కడికక్కడే మృతి చెందారు. ధనుష్ ప్రాణాలతో బయటపడ్డాడు. అతడు గ్రామానికి వెళ్లి విషయం చెప్పాడు. మృతుల కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఘటనాస్థలికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు యువకుల మృతదేహాలను పంచనామా కోసం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు యువకులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బ్రహ్మసముద్రం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జనసేన నాయకుడి చీనీ చెట్ల నరికివేత



చీనీ చెట్లను పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి (ధర్మవరం, న్యూస్‌టుడే): బత్తలపల్లి మండలం తంబాపురం గ్రామానికి చెందిన జనసేన నాయకుడు రమణారెడ్డికి చెందిన వ్యవసాయతోటలో శుక్రవారం రాత్రి 53 చీనీ చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. శనివారం గమనించిన రమణారెడ్డి బత్తలపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రెండు ఎకరాల పొలంలో చీనీ సాగు చేస్తున్నానని, 370 చెట్లు ఉండగా వాటిలో రెండు ఏళ్ల వయసున్న 53 చెట్లను గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారని రమణారెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. బత్తలపల్లి ఎస్ఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. జనసేన పార్టీ బత్తలపల్లి మండల అధ్యక్షుడు రవి, తదితరులు గ్రామానికి వెళ్లి చీనీతోటను పరిశీలించి రైతుతో మాట్లాడారు.

కబ్జా కోరల్లో వక్ఫ్ బోర్డు భూములు

విపణి ధర రూ.80 కోట్లు పైమాటే



టి.కొత్తపల్లిలోని వక్ఫ్ బోర్డు భూమిలో పంట సాగు

గుత్తి, న్యూస్‌టుడే : వక్ఫ్ బోర్డు అధికారుల నిర్లక్ష్యం, రెవెన్యూ అధికారుల అలసత్వంతో గుత్తి పట్టణంతోపాటు గుంతకల్లు గ్రామీణంలో రూ.80 కోట్లు విలువైన వక్ఫ్ బోర్డు భూములు అన్యాక్రాంతమయ్యాయి. దీనిపై పలువురు ఆక్రమణదారులతో కుమ్మక్కయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా తయారైంది.

అధికారుల అండతో ఆక్రమణల పర్వం

- గుత్తిలోని సర్వే నంబర్ 601, 603-బీ, 410, 414, 604, 603-ఏలలోని రూ.కోట్లు విలువైన స్థలాలు అన్యాక్రాంతమయ్యాయి. భూములు, స్థలాలను పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు కాసులకు కక్కుర్తి పడుతూ ఆక్రమణదారులకు వక్ఫ్ బోర్డు ఆస్తులపై చట్టబద్ధత కల్పిస్తున్నారు. ఏకంగా పట్టాదారు పాసుపుస్తకాలను జారీ చేశారు.
- గుత్తి పట్టణంలోని నిజామీ షాదీఖానా వద్ద కొందరు స్థలాలను లీజుకు తీసుకుని శాశ్వత కట్టడాలు నిర్మించారు. రాజకీయ అండదండలున్న వారు స్థలాలను ఆక్రమిస్తున్నారు.
- పాతహైవేకు ఇరువైపులా ఉన్న సుమారు 10 ఎకరాల స్థలాన్ని కబ్జా చేశారు. కొందరు భవంతులు నిర్మించుకున్నారు. మరికొందరు దుకాణ సముదాయాన్ని నిర్మించుకుని అద్దెలు తీసుకుంటున్నారు.
- ఓ వ్యక్తికి రెవెన్యూ అధికారులు ఇంటి పట్టా ఇచ్చారు. వక్ఫ్ బోర్డు స్థలానికి రెవెన్యూ అధికారులు పట్టాలిచ్చి డబ్బులు వెనకేసుకున్నారని చర్చ జరుగుతోంది.
- బీసీ కాలనీలోని ఐదెకరాల భూమిలో కొందరు ప్లాట్లు వేసి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈవిషయం తెలిసినా వక్ఫ్‌బోర్డు అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.
- గుంతకల్లు మండలంలోని నక్కన దొడ్డి నరసాపురంలోని సర్వేనంబర్ 729లో 19.40 ఎకరాలు కబ్జాకు గురయ్యాయి. రూ.30 కోట్లు విలువైన భూమిని ఆరుగురు ఆక్రమించారు. ఎంచక్కా బోరుబావులు తవ్వుకుని తోటలు సాగు చేస్తున్నారు. ఐదేళ్ల కిందట రెవెన్యూ అధికారులు లోపాయికారిగా ఆరుగురికి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేశారు. 8నెలల కిందట 'ఈనాడు'లో కథనాన్ని ప్రచురించగా రెవెన్యూ అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి చేతులు దులిపేసుకున్నారు.
- గుత్తి మండలంలోని టి.కొత్తపల్లిలో సర్వేనంబర్ 89లో 20.60 ఎకరాల వక్ఫ్ భూమి ఉంది. ఇందులో ఆరు ఎకరాలు ఆక్రమించారు. కొందరు ఇళ్లను నిర్మిస్తున్నారు. మరికొందరు పంటలు సాగు చేస్తున్నారు. ఇక్కడ ఎకరా రూ.30లక్షలు ధర ఉంది. అధికారుల పర్యవేక్షణలోపం వల్ల రూ.18 కోట్ల భూమి అన్యాక్రాంతం అయింది. వక్ఫ్ బోర్డు అధికారులు మసీదులు, దర్గాల ఆస్తులు ఎక్కడెక్కడున్నాయో చూడటంలేదు.

సహకారం కోరితే ఆక్రమణలు తొలగిస్తాం


వక్ఫ్ బోర్డు అధికారులు తమ సహకారం కోరితే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. తామంతట తామే ఆక్రమణల తొలగింపునకు వెళ్లలేం. తమకు లిఖిత పూర్వకంగా లేఖ ఇస్తే ఆక్రమణల తొలగింపునకు సహకారం అందిస్తాం.

-ఓబులేసు, తహసీల్దారు, గుత్తి

వివాహిత ఆత్మహత్య

కదిరి పట్టణం: కదిరి పట్టణం పార్థసారథికాలనీలో రమణమ్మ(58) అనే వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యులు, కదిరి పట్టణ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. రమణమ్మ భర్త కరోనా సమయంలో మృతి చెందారు. ఇద్దరు కుమారులు ఉపాధి కోసం ఒకరు బెంగళూరు, మరొకరు హిందూపురం వెళ్లి అక్కడే ఉంటున్నారు. వెన్నునొప్పితో కొంతకాలంగా బాధపడుతున్న రమణమ్మ చికిత్స తీసుకున్నా నయం కాలేదు. వెన్నునొప్పి బాధను భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

'గడువుకు ముందుగానే దరఖాస్తు చేసుకోండి'



సమావేశంలో మాట్లాడుతున్న నాగమద్దయ్య, ఏసీ మునిస్వామి, ఈఎస్ రామమోహన్‌రెడ్డి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: కొత్త మద్యం దుకాణాల దరఖాస్తుకు ఈ నెల 9న చివరి తేదీ అందువల్ల అంతలోపే దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ పి.నాగమద్దయ్య ఆశావహులకు సూచించారు. ఆయన శనివారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. దుకాణాల ఏర్పాటుకు ఆశావహుల నుంచి ఆన్‌లైన్, హైబ్రిడ్, ఆఫ్‌లైన్ విధానంలో స్వీకరిస్తున్నామన్నారు. కొందరు దరఖాస్తు చేయడంలో ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎలాంటి సందేహాలు, ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదని.. దరఖాస్తులను కేవలం దరఖాస్తు పేరు, వయసు, చిరునామా, చరవాణి నంబరు, ఏదైనా ఒక గుర్తింపు కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు కల్గి ఉంటేచాలన్నారు. దరఖాస్తులు గడువు ఆఖరు వరకు వేచి చూడొద్దని, ముందుగానే మేల్కొని, ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు. మద్యం దుకాణాల ఎంపిక చాలా పారదర్శకంగా జరుగుతాయని, అపోహలు పడొద్దని డిప్యూటీ కమిషనర్ సూచించారు. ఎలాంటి రాజకీయ, ఏకపక్ష నిర్ణయాలు ఎంపికలో ఉండవన్నారు.

రాయదుర్గం
•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

విద్యుత్తు ఉపకేంద్రం ముట్టడి

కణేకల్లు, న్యూస్‌టుడే: కణేకల్లు విద్యుత్తు ఉపకేంద్రంలోని బ్రేకర్‌లో రిలే పార్ట్ పాడవడంతో శనివారం మధ్యాహ్నం 3గంటల నుంచి సరఫరా నిలిచిపోయింది. రాత్రి 9గంటలైనా విద్యుత్తు సరఫరా కాకపోవడంతో ప్రజలు చీకట్లో తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఆగ్రహంతో విద్యుత్తు ఉపకేంద్రాన్ని ముట్టడించి, ఆందోళనకు దిగారు. స్పందించిన కళ్యాణదుర్గం డీఈ శేషాద్రి శేఖర్, ఏడీఈ గురురాజన్ కణేకల్లుకు పంపి మరమ్మతులు చేయించారు. రాత్రి 10గంటలకు సరఫరాను పునరుద్ధరించడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

ఆరుబయట మద్యం తాగితే చర్యలు

రాయదుర్గం పట్టణం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ జయనాయక్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. బహిరంగ మద్యం తాగడం, అనుమతించిన ప్రదేశాల్లో, వేగంగా వాహనాలు నడపడం, కేకలు వేయడం వంటి వాటిపై ఫిర్యాదులు అందాయని తెలిపారు.

కొత్తిమీర కట్ట రూపాయి

రాయదుర్గం, న్యూస్‌టుడే: గత నెల రూ.20 పలికిన కొత్తిమీర ధర అమాంతం పడిపోయింది. రాయదుర్గంలో రూపాయికి ఒక కట్ట అమ్ముతున్నా కొనేవారు లేరు. చేసేదిలేక రైతులు హోల్‌సేల్‌గా రూపాయికి రెండు కట్టల చొప్పున రిటైల్ వ్యాపారులకు విక్రయించారు. ఈ డబ్బులు విత్తనాలకు కూడా సరిపోవని రైతు తిప్పేస్వామి వాపోయారు.



కొత్తిమీర విక్రయిస్తున్న రైతులు

దంచికొట్టిన వాన



బండూరు ఆర్టీసీ కాలనీ జలమయం



రాయదుర్గం పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాల్లోకి చేరిన వరదనీరు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: బొమ్మనహాళ్ మండలంలో శనివారం అర్ధరాత్రి నుంచి కుండపోత వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. పత్తి, మిరప, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లాలోనే ఈ మండలంలో అత్యధికంగా 148.0 మి.మీ వర్షపాతం నమోదైంది. ఉద్దేహాళ్ బీసీ, ఎస్సీ కాలనీ, బండూరు ఆర్టీసీ, ఉంతకల్లు ఎస్టీ, ఎస్సీ కాలనీలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఇళ్లు, కార్యాలయాల్లోకి నీరు చేరాయి. బండూరు నుంచి ఉద్దేహాళ్, బొమ్మనహాళ్ రహదారిపై నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి.



బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్ వద్ద నీటమునిగిన వరి పంట

వేదావతి హగరికి వరద ఉద్ధృతి

కణేకల్లు: కణేకల్లు వద్ద వేదావతి హగరికి శనివారం రాత్రి 7.30కు ఊహించని విధంగా వరద ఉద్ధృతి పెరిగింది. ఎగువ ప్రాంతాలైన హనకనహాళ్, బెళుగుప్ప, తగ్గుపర్తి తదితర గ్రామాల్లో కురిసిన వర్షానికి కోటిపి చెరువు నిండి ప్రవహించడంతో హగరికి వరద పెరిగిందని రెవెన్యూ అధికారులు తెలిపారు. వరద ఉద్ధృతికి కణేకల్లు నుంచి మాల్యం గ్రామానికి హగరిలో ఇటీవలే నాయకులు సొంత నిధులతో తాత్కాలికంగా వేసిన మట్టి రోడ్డు తెగిపోయింది. దాంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. అటువైపు వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తగా అధికారులు కంపతో అడ్డుకట్ట వేయించారు.



రోడ్డును పరిశీలిస్తున్న తెదేపా నాయకులు

కుంగిన రహదారి

డి.హీరేహాళ్(రాయదుర్గం పట్టణం): డి.హీరేహాళ్ మండలంలోని దొడగట్ట గ్రామంలో తారురోడ్డు కుంగింది. స్థానిక తెదేపా నాయకులు మోహన్‌రెడ్డి, రామాంజనేయులు పొక్లెయిన్‌తో దారిని తవ్వి మట్టి వేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు.



కళ్యాణదుర్గం గ్రామీణం: కళ్యాణదుర్గం మండలం తూర్పుకోడిపల్లికి చెందిన భాగ్యమ్మకు చెందిన ఇల్లు వర్షానికి కూలిపోయింది. కుటుంబ సభ్యులతో కలిసి పక్కనే ఉన్న గదిలో నిద్రిస్తుండగా ఉన్నఫలంగా ఇల్లు కూలిపోయింది. తిండిగింజలు, దుస్తులు, ఇతర రాత్ర వస్తువులు తడిసిపోయాయని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేశారు.

తూర్పుకోడిపల్లిలో వర్షానికి కూలిన ఇల్లు



రాయదుర్గం: రాయదుర్గంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వరదనీరు ఇళ్లల్లోకి చేరడంతో ప్రజలు రాత్రంతా జాగారం చేశారు. రామస్వామివీధి, కొలిమి వీధి, మధుటాకీస్ ఏరియా, సిండికేట్ బ్యాంకు వెనుక కాలనీల్లో వరద నీటితో ప్రజలు అవస్థ పడ్డారు.

రాయదుర్గం: మధు టాకీస్ ఏరియాలో వరద నీటిని ఎత్తిపోస్తున్న మహిళ



పాల్తూరు వద్ద నీట మునిగిన జొన్న పొలాన్ని చూపుతున్న రైతు రవి

ఉరవకొండ: ఉరవకొండ-బొమ్మనహాళ్ రహదారిలో పాల్తూరు వద్ద, విడపనకల్లు మండలం ఉండబండ వద్ద వంకలు పారడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. పాల్తూరు పరిసరాల్లో మిరప, జొన్న పంటలు దెబ్బతిన్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

రాయదుర్గం పట్టణం: 9666888046, కళ్యాణదుర్గం గ్రామీణం: 9985666661, : 8008573071

సమస్య: దర్గాహొన్నూరులో శ్రీరామిరెడ్డి తాగునీటి కుళాయి వద్ద దెబ్బతిన్న ప్లాట్‌ఫాం మరమ్మతులు చేయాలి. **- మన్నూరుస్వామి**
సమాధానం: ప్రతిపాదనలు పంపుతాం. **- కుళ్లాయినాయుడు, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, బొమ్మనహాళ్**
సమస్య: గుమ్మఘట్ట మండలం నేత్రపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డులో కల్వర్టుపై పడిన గుంతలు పూడ్చాలి. **- గంగాధర**
సమాధానం: తగు చర్యలు చేపడతాం. **- సురేశ్, ఏఈఆర్టీ**
సమస్య: తాళ్లకెర పంచాయతీలోని కేసాపురం గొల్లలదొడ్డి వద్ద ఉన్న ఆర్టీటీ కాలనీలో సీసీరోడ్డు వేయాలి. **- క్యాతన్న**
సమాధానం: ప్రతిపాదనలు పంపాం, మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తాం. **- నరసింహమూర్తి, ఎంపీడీవో**
సమస్య: బెళుగుప్ప మండలం గుండ్లపల్లిలో అంబేడ్కర్ కూడలి నుంచి పాత చెక్‌పోస్టు వరకు పడిన గుంతలు పూడ్చాలి. **- భానుప్రకాశ్**
సమాధానం: పూడ్చివేయిస్తాం. **- శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి**
సమస్య: అప్పాజిపాళ్యంలో తాగునీటి ట్యాంకు వద్ద అపరిశుభ్రతను తొలగించాలి. **- వెంకటేశులు**
సమాధానం: శుభ్రం చేయిస్తాం. **- ఫక్కుద్దీన్, గ్రామ కార్యదర్శి**
సమస్య: గురువేపల్లి గేటు వద్ద పశువుల తాగునీటి తొట్టికి నీరు అందక వృథాగా ఉంది. **- ఈరన్న, రైతు, గురువేపల్లి**
సమాధానం: నీరందేలా చూస్తాం.
- ఆనందరాఘవ, గ్రామకార్యదర్శి, ఎనుములదొడ్డి
సమస్య: కుందుర్పిలో కుందుర్పమ్మ కొండకు వెళ్లే దారికి ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు, కంపచెట్లను తొలగించాలి. **- కాలనీవాసులు**
సమాధానం: శుభ్రం చేయిస్తాం.
- బాషా, గ్రామ కార్యదర్శి, కుందుర్పి
– న్యూస్‌టుడే, కుందుర్పి, బెళుగుప్ప, గుమ్మఘట్ట

పేదల కడుపు నింపేందుకే అన్న క్యాంటీన్లు

రాయదుర్గం, న్యూస్‌టుడే: పేదల కడుపులు నింపేందుకే అన్న క్యాంటీన్లు ప్రారంభించినట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని పాతబస్టాండులో శనివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. పేదలకు భోజనం వడ్డించారు. అనంతరం జనసేన అధ్యక్షుడు మంజునాథగౌడతో కలిసి కాలవ భోజనం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి, కౌన్సిలర్‌లు, తెదేపా నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

సభ్యత్వ నమోదులో అగ్రగామిగా నిలుపుదాం: రాష్ట్రంలో తెదేపా సభ్యత్వ నమోదులో రాయదుర్గాన్ని అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక తెదేపా కార్యాలయంలో శనివారం ఉదయం చేసిన తెదేపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాల మేరకే పదవులు కట్టబెట్టామని, పదవులు దక్కని వారు నిరాశ, అసంతృప్తికి గురికావొద్దన్నారు. అందరికీ న్యాయం చేస్తామన్నారు. * పట్టణంలోని దశభుజ గణపతి ఆలయంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ గోపురం నిర్మాణానికి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పూజలు జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బీఎన్‌టీ వెంకటేశులు, సభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు



కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కోటవీధిలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి స్వామిని పలు రకాల పుష్పాలతో అలంకరించి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణ

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం ఆలయంలో అగ్ని ప్రతిష్ఠ, కలశస్థాపన పూజలు, స్వామికి అభిషేకాలు చేసి అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి



కళ్యాణదుర్గం గ్రామీణం: రాజరాజేశ్వరి అలంకరణలో చౌడేశ్వరిదేవి



ఉరవకొండ: అన్నపూర్ణేశ్వరిగా ఉరగాద్రి చౌడేశ్వరిదేవి



కళ్యాణదుర్గం: అన్నపూర్ణదేవి అలంకరణ



రాయదుర్గం: వాసవీమాత

అన్నపూర్ణేశ్వరి..అభయ ప్రదాయిని



కణేకల్లు: సరస్వతిదేవిగా దుర్గామాత

దసరా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో శనివారం అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. **- న్యూస్‌టుడే బృందం**



కణేకల్లు: ముకాంబిక అలంకరణలో దుర్గాభక్తవత్సలమాత

డీఎల్‌డీవో బాధ్యతల స్వీకరణ

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం డివిజన్ పరిపాలన అధికారిగా నాగేశ్వరరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న డీఎల్‌డీవో శంకర్ పదోన్నతిపై గుంటూరు డ్వామా పీడీగా పదోన్నతి వెళ్లారు.

కళ్యాణదుర్గం గ్రామీణం: కళ్యాణదుర్గం డీఆర్‌డీఏ వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ నారాయణస్వామి శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న రాధారాణి జిల్లా కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఏపీఎంగా హుసేన్, ఎల్‌సీసీ (లీగల్ కోఆర్డినేటర్) కామరాజు పిల్లలపల్లి క్లస్టర్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో రాయదుర్గం స్త్రీనిధి మేనేజరు గోవిందరాజులు బాధ్యతలు తీసుకొన్నారు.

‘కార్మికులు సమ్మె చేస్తున్నా పట్టదా?’

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలని శ్రీరామిరెడ్డి నీటి పథకం కార్మికులు సమ్మె చేస్తున్నా అధికారుల్లో ఏమాత్రం చలనం లేకపోవడం శోచనీయమని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ అన్నారు. కళ్యాణదుర్గంలోని శ్రీరామిరెడ్డి నీటి పథకం పంప్‌హౌస్ వద్ద చేపడుతున్న సమ్మె శనివారం ఏడో రోజుకు చేరుకుంది.

మూఢాచారాలు నిర్మూలించాలి

రాయదుర్గం పట్టణం: నేటి ఆధునిక సమాజంలో కుల వివక్ష, జోగిని, బసివిని లాంటి మూఢ నమ్మకాలను పూర్తిగా నిర్మూలించడంలో పాలక పక్షాలు విఫలం అవుతున్నాయని ఎస్సీ, ఎస్టీ సంఘాల ఐకాస రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అన్నారు. శనివారం పట్టణంలోని ర.భ శాఖ అతిథి గృహంలో స్థానిక నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత, గిరిజన మహిళలను ఆచారాల పేరిట, గతంలో బసివిని, దేవదాసి వ్యవస్థలాంటి దుర్మార్గపు కుట్రలను అందరూ గమనించాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం వారికి సాగు భూమి, ఆర్థిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

భాజపా సభ్యత్వ నమోదు ప్రారంభం


కుందుర్పి, న్యూస్‌టుడే: మండలంలో భాజపా రెండోదశ సభ్యత్వ నమోదును, పార్టీ అనంతపురం జిల్లా కన్వీనర్ లలిత్ కుమార్, మండల అధ్యక్షుడు వెంకటేశులు ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు.

అంతర్గత రహదారులకు మోక్షం

•రూ.14.75 కోట్లు మంజూరు

ఉరవకొండ, న్యూస్‌టుడే: గ్రామాల్లోని వీధుల్లో మట్టిరోడ్లకు మహర్దశ రానుంది. సీసీ రోడ్ల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ఉపాధి పథకం కింద నిధులు మంజూరు చేసింది. ఉరవకొండ నియోజకవర్గంలోని ఉరవకొండ, విడపనకల్లు, బెళుగుప్ప, కూడేరు, వజ్రకరూరు మండలాల్లో 91 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 3లక్షలకు పైగా జనాభా నివసిస్తున్నారు. చాలా గ్రామాల్లోని వీధుల్లో నేటికీ పూర్తిస్థాయిలో సిమెంటు రోడ్లు లేవు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టింది. అందులో భాగంగానే సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. ఉపాధి హామీ పథకం కింద ఐదు మండలాల్లోని 91 గ్రామ పంచాయతీలకు రూ. 14.75కోట్లు మంజూరు చేసింది. మొత్తం 329 పనులను గుర్తించారు. 32.42 కిలోమీటర్ల మేర సీసీరోడ్లు నిర్మించనున్నారు.

మండలం	గ్రామ పంచాయతీ	గుర్తించిన పనులు	నిధులు (రూ.కోట్లలో)
ఉరవకొండ	25	92	4.31
బెళుగుప్ప	18	56	2.61
కూడేరు	13	49	2.06
వజ్రకరూరు	19	68	2.80
విడపనకల్లు	16	64	2.96



పాల్తూరులోని ఓవీధిలో మట్టిరోడ్డు.. త్వరలోనే సీసీరహదారి నిర్మించనున్నారు

పనులు త్వరలోనే ప్రారంభిస్తాం

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. ఎక్కడికక్కడ గుత్తేదారులకు అప్పగించి, పనులు నాణ్యతగా, వేగవంతంగా నిర్మించేలా ఏర్పాట్లు చేస్తున్నాం.
- మహ్మద్ రసూల్, పీఆర్ డీఈఈ, ఉరవకొండ

వీరశైవుల డిమాండ్లు పరిష్కరించాలి

కణేకల్లు, న్యూస్‌టుడే: వీరశైవులను ఓబీసీ జాబితాలో చేర్చాలన్న ప్రధాన డిమాండును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని అఖిల భారత వీరశైవ సంఘం రాష్ట్ర సభ్యుడు మరియప్ప డిమాండ్ చేశారు. శనివారం కణేకల్లులో ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం బసవ భవన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అఖిల భారత వీరశైవుల సంఘం రాష్ట్ర కమిటీలో మండలానికి చెందిన శరబనగౌడ, తిప్పేస్వామి, పెండేకల్లు నాగరాజుకు చోటు కల్పించడం పట్ల అభినందనలు తెలిపి సత్కరించారు.

ఘనంగా అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం

ఉరవకొండ, న్యూస్‌టుడే: మండలంలోని చిన్న ముష్టూరు వద్ద ఉన్న ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో నైపుణ్య శిక్షణ పొందుతున్న యువత ఈఈఈ విభాగాధిపతి సురేశ్‌బాబును సత్కరించారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం పదిలంగా ఉంచుకోవచ్చని జూనియర్ సివిల్ జడ్జి రమ్య అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా కోర్టు ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి చెత్తను తొలగించి, పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటరెడ్డి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ లోకానంద, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



రాయదుర్గం: చెత్తను తొలగిస్తున్న జడ్జి రమ్య తదితరులు

ఉరవకొండ: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి దుర్గాకల్యాణి, న్యాయవాదులు పరిసరాలను శుభ్రం చేశారు.
కళ్యాణదుర్గం: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో న్యాయవాదులు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు శుభ్రత చర్యలు చేపట్టారు. చీపుర్లు పట్టుకుని కోర్టు ఆవరణాన్ని శుభ్రం చేశారు. పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిచక్రవర్తి, న్యాయవాది దాదాఖలందర్, కోర్టు సిబ్బంది ఆదినారాయణ, చంద్రమౌళి, మున్సిపల్ పారిశుద్ధ్య అధికారులు అలీఖాన్, తిప్పేస్వామి, మేస్త్రీ కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

పిల్లల పెంపకంపై దృష్టి పెట్టండి

ఉరవకొండ, న్యూస్‌టుడే: ‘తండ్రులు, వారి స్థానంలో ఉన్న వారే పిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న సందర్భాలు చూస్తున్నాం. ఇలాంటి తరుణంలో తమ పిల్లలు ఏమి చేస్తున్నారనే దానిపై ప్రతి తల్లి ప్రత్యేక దృష్టి పెట్టాలని మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్, ఉరవకొండ జూనియర్ సివిల్ జడ్జి దుర్గాకల్యాణి తెలిపారు. పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో జాతీయ మహిళా కమిషన్, న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. బాలికలు చదువుకునే వసతి గృహాల్లో మహిళలే అధికారులు, సిబ్బంది ఉన్నారా? లేదా? తెలుసుకోవాలన్నారు. వారానికోసారి పిల్లలను కలవాలని సూచించారు. 18 సంవత్సరాల వయస్సు దాటేంత వరకు సెల్‌ఫోన్లు ఇవ్వొద్దన్నారు. మహిళలు హింసకు గురైతే ఎలాంటి చట్టాలు రక్షణగా నిలుస్తాయో వివరించారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ డాక్టర్ శ్రీదేవి, న్యాయవాదులు దేవినేని లీలావతి, జహీరాబీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రబియా, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి దుర్గాకల్యాణి

7న ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కళ్యాణదుర్గం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఈనెల 7న ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్లు శిక్షణ కలెక్టర్, ఇంఛార్జి రెవెన్యూ డివిజనల్ అధికారిణి వినూత్న తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

యూరియా నిల్వలు ఖాళీ

కణేకల్లు, న్యూస్‌టుడే: కణేకల్లు మండలంలో యూరియా కొరత నెలకొంది. కణేకల్లు, బ్రహ్మసముద్రం, ఆదర్శ భారతి సొసైటీల్లో, ఇతర దుకాణాల్లో యూరియా అందుబాటులో లేదు. హెచ్చెల్సీ కింద సాగైన వరి పంటకు మూడో కోటా కింద యూరియా చల్లడానికి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గడువు దాటాకా చల్లినా ప్రయోజనం ఉండదని వాపోతున్నారు. దీన్ని ఆసరాగా తీసుకొని ప్రైవేటు దుకాణాదారులు అధిక ధరలకు విక్రయించారన్న విమర్శలున్నాయి. ఇతర ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామని మెలిక పెట్టి అమ్మకాలు సాగించారని రైతులు ఆరోపించారు. గత శుక్రవారం ప్రైవేటు దుకాణాల్లోనూ యూరియా లభించక అన్నదాతలు అవస్థ పడ్డారు. మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు పెన్నేశ్వరి మాత్రం సొసైటీలకు చాలినంత సరఫరా చేశామని, రైతు సేవా కేంద్రాలలో యూరియా నిల్వలు ఉన్నాయని చెప్పారు.



కంపచెట్లు తొలగించరూ

వజ్రకరూరు మండలంలోని పొట్టిపాడు నుంచి చాబాలకు వెళ్లే రహదారిలో కంపచెట్లు పెరిగి ప్రమాదకరంగా మారాయి. వాహనాలు ఎదురెదురుగా వచ్చినప్పుడు అవి తగిలి పలువురు గాయపడుతున్నారు. ఒక్కోసారి వాటిని తప్పించబోయి ప్రమాదాలకు గురవుతున్నారు. సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా రహదారి ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోకి వస్తుందని, వారి దృష్టికి తీసుకువెళ్లి కంపచెట్లను తొలగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. **-న్యూస్‌టుడే, వజ్రకరూరు**

ఆటో బోల్తాపడి ఒకరి దుర్మరణం

కణేకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని నల్లంపల్లి వద్ద ఆటో బోల్తాపడి ఆదిగానిపల్లి గ్రామానికి చెందిన రైతు ఎర్రిస్వామి(58) మృతిచెందారు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. అనారోగ్యంతో బాధపడుతున్న భార్యకు మందులు తేవడానికి ఎర్రిస్వామి కణేకల్లు క్రాసింగ్‌కు వెళ్లారు. తిరిగి రాయదుర్గం వెళ్తున్న ఆటో ఎక్కారు. మార్గమధ్యలో కుక్క అడ్డు రావడంతో డ్రైవర్ బ్రేకు వేయగా ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఎర్రిస్వామి తలకు, కణితి వద్ద బలమైన గాయాలయ్యాయి. మిగతా ఐదుగురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రుడిని రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయనకు భార్య తిమ్మక్క, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు రాయదుర్గం మండలం డి.కొండాపురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవరు ఉమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



ఎర్రిస్వామి

చికిత్స పొందుతూ యువకుడి మృతి

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కొంతానపల్లి గ్రామానికి చెందిన రవి(26) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ బళ్లారి విమ్స్‌లో మృతి చెందాడు. అతనికి భార్య ఉంది. ఈనెల 3న రాయదుర్గం నుంచి కొంతానపల్లికి రవి, ఆయన స్నేహితుడు చంద్రశేఖర్ ద్విచక్ర వాహనంపై వెళ్తూ మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఆర్బీవంక గ్రామానికి చెందిన ఆంజనేయులు, నరసింహులు, లక్ష్మీతోపాటు రవికి తీవ్ర గాయాలయ్యాయి. రవి బళ్లారిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. రాయదుర్గం అర్బన్ సీఐ జయనాయక్ కేసు దర్యాప్తు చేపట్టారు.

జీవాలపై చిరుత పంజా

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లిలో చిరుత దాడిలో ఐదు మూగజీవాలు మృతి చెందాయి. గ్రామ సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాల వద్ద శివప్ప జీవాల మందను పోషించుకుంటున్నారు. శుక్ర, శనివారాల్లో తెల్లవారుజామున చిరుత ఐదు జీవాలను చంపి వేసిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.70 వేల వరకు నష్టం వాటిల్లినట్లు వాపోయారు.

క్రైం కార్నర్

బూదగవిలో చోరీ

ఉరవకొండ, న్యూస్‌టుడే: మండలంలోని బూదగవి గ్రామంలో నివాసం ఉంటున్న ధనుంజయ ఇంట్లో చోరీ జరిగింది. అతడు వ్యవసాయంతోపాటు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో దొంగలు తాళాన్ని పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. బంధువులు శనివారం వేకువజామున గుర్తించి, బాధితులకు సమాచారం ఇచ్చారు. వారి వచ్చి చూడగా బీరువాలోని వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. రూ.1.49లక్షల నగదు, ఏడు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కష్టపడి సంపాదించుకున్న సొమ్ము, ఆభరణాలు చోరీకి గురి కావడంతో బాధితులు రోధించారు.

మట్కా నిర్వాహకురాలి అరెస్టు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని రాచప్పబావి వీధిలో రేణుకమ్మ ఇంటి వద్ద మట్కా రాస్తుండగా దాడి చేసి అరెస్టు చేసినట్లు సీఐ వెంకటరమణ శనివారం తెలిపారు. ఆమె నుంచి మట్కా చీటీలు, రూ.47,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

కసాపురంలో దాతల పేర్లు లేకుండా అన్నదానం

గుంతకల్లు గ్రామీణం : కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించే అన్నదానం కార్యక్రమంలో దాతల పేర్లు లేకుండా అన్నదానం నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం రోజు అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయం నుంచి ఉత్తరం ద్వారా సమాచారం అందుకుని మధ్యాహ్నం అన్నదాన సమయంలో పరిశీలించగా దాతల వివరాలు లేకుండానే చేస్తున్నారు. నిత్య అన్నదాన నిర్వాహణ బాధ్యతలు తీసుకున్న లక్ష్మీరావును ప్రశ్నించగా ప్రతి రోజు దాతల పేర్లు నోటీసు బోర్డులో ఉంచుతున్నామన్నారు. దాత అరగంట పాటు వేచి ఉన్నా అక్కడ నుండి వెళ్లిపోయారు. ఈ విషయమై ఆలయ ఈవో కె.వాణిని వివరణ కోరగా.. దాతల వివరాలు తెలియజేయలేని వారికి నోటీసులు ఇవ్వాలని సీనియర్ అసిస్టెంట్ వేమన్నను ఆదేశించారు.

బయోమెట్రిక్ విధానం సద్వినియోగం చేసుకోవాలి

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: ప్రస్తుత వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంట నమోదు కార్యక్రమం అనంతరం బయోమెట్రిక్ విధానాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ సాయాన్ని పొందాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. చిట్టిచేడు, మొలకకాల్వ, క్రిష్టిపాడు, అప్పేచెర్ల, గ్రామాల్లో శనివారం పంట నమోదు, ఈకేవైసీ కార్యక్రమాలను పరిశీలించారు. ఈకేవైసీ వేయని రైతులు ప్రస్తుతం తమ గ్రామాల్లో ఉంటున్న వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్లి బయోమెట్రిక్‌ను వేయాలన్నారు.



పొలాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య: గుంతకల్లులోని టీబీ రోడ్డులో చెత్త పేరుకుపోయింది.- **బాబు**
సమాధానం: శుభ్రం చేయిస్తాం - **గంగాధర్, శానిటేషన్ కార్యదర్శి**
సమస్య: శింగనమల మండలంలోని ఇరువెందల ఆలయం వద్ద మురుగు, వర్షపునీరు నిల్వ ఉంటోంది. - **పరమేశ్వర్**
సమాధానం: గ్రామ పంచాయతీ కార్యదర్శికి తెలియజేసి సమస్యను పరిష్కరిస్తాం. - **నిర్మలకుమారి, ఎంపీడీవో**
సమస్య: శింగనమల మండలంలోని నాగులగుడ్డం ఎస్సీ కాలనీలో వీధి దీపాలు లేవు. - **నవీన్**
సమాధానం: వెంటనే సమస్యను పరిష్కరిస్తాం. - **నిర్మలకుమారి, ఎంపీడీవో**
–న్యూస్‌టుడే,గుంతకల్లు పట్టణం, శింగనమల

కోర్టు ప్రాంగణంలో శ్రమదానం

గుత్తి, న్యూస్‌టుడే: స్థానిక ఏడీజే, సబ్‌కోర్టు, జేఎఫ్‌సీఎం కోర్టుల వద్ద శనివారం న్యాయమూర్తులు శ్రీహరి, కాశీవిశ్వనాథరావు, న్యాయవాదులు శ్రమదానం చేశారు. మూడు కోర్టుల ప్రాంగణంలోని పిచ్చిమొక్కలను తొలగించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా శ్రమదానం చేశారు. బార్‌అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వీటీ రత్నం, మాజీ ఏపీపీ మహేశ్, పారాలీగల్ వాలంటీర్ నరసింహనాయుడు, న్యాయవాదులు చలపతి, మనోహర్‌బాబు, ఓబులేశ్, పక్కీరప్ప పాల్గొన్నారు.



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న న్యాయమూర్తులు, తదితరులు

గుంతకల్లు: స్థానిక న్యాయస్థానంలో శనివారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం జరిగింది. జ్యుడీషియల్ మొదటి తరగతి న్యాయమూర్తి మంజుల సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. కోర్టు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కోర్టు పర్యవేక్షకుడు కిరణ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యూనస్, కోశాధికారి సురేశ్, న్యాయవాదులు తిమ్మప్ప, తాజుద్దీన్ పాల్గొన్నారు.

నిధులివ్వక.. ఆధునికీకరణ జరగక

వైకాపా నిర్లక్ష్యంతో మరమ్మతులకు నోచుకోని సాగు నీటి కాలువలు

గుంతకల్లు, గుత్తి, గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం గత ఐదేళ్లలో కాలువల ఆధునికీకరణ, మరమ్మతులకు ఒక్క పైసా కూడా కేటాయించక పోవడంతో కాలువలు అధ్వానంగా మారాయి. అధికారులు ఆయకట్టు రైతులకు కాలువల ద్వారా అవసరమైనంత సాగునీటిని అందించక పోతుండడంతో నష్టపోవాల్సి వస్తోంది. తుంగభద్ర ఎగువ కాలువలో భాగమైన గుంతకల్లు బ్రాంచ్ కాలువ, గుత్తి ఉపకాలువల పరిస్థితి దారుణంగా ఉంది. గుంతకల్లు బ్రాంచ్ కాలువ లైనింగ్ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. గుత్తి ఉపకాలువ పనులే ప్రారంభించలేదు. గుంతకల్లు బ్రాంచ్ కాలువ నుంచి గుత్తి ఉపకాలువకు నీటిని సరఫరా చేయాల్సి ఉంది. అయితే గుంతకల్లు బ్రాంచ్ కాలువ సక్రమంగా లేకపోవడంతో గుత్తి కాలువకు నీరు సరఫరా కావడం లేదు. అనధికారికంగా హంద్రీనీవా కాలువ నుంచి కొద్దిపాటి నీటిని గుత్తి కాలువకు సరఫరా చేస్తున్నారు.



ముళ్లపొదలతో అధ్వానంగా ఉన్న గుత్తి ఉపకాలువ

అంచనాలు పంపినా పట్టించుకోలేదు..

గుంతకల్లు బ్రాంచ్ కాలువ పొడవు 58 కి.మీ.లు. ఇందులో 20 కి.మీ.ల పొడవున మాత్రమే కాలువను ఆధునికీకరించారు. మిగిలిన 38 కి.మీ.ల ఆధునికీకరణకు రూ.50 కోట్లను కేటాయించాలని జీబీసీ డివిజన్ అధికారులు నాలుగేళ్ల నుంచి వైకాపా ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకోలేదు. గుత్తి ఉపకాలువకు కాలువను నిర్మించే సమయంలో లైనింగ్ పనులు చేయలేదు. పనులను పూర్తిచేసి 14 ఏళ్లు అవుతున్నా కాలువకు ఎలాంటి మరమ్మతులు చేయలేదు. ఫలితంగా కాలువ మట్టితో నిండి ముళ్లపొదలు ఏపుగా పెరుగుతున్నాయి. గుత్తి ఉపకాలువ కింద దాదాపు 16,271 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులో ఏటా 4 వేల ఎకరాలకు మించి కాలువ నుంచి పొలాలకు నీరందక పోవడంతో ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గుత్తి కాలువను ఆధునికీకరించడానికి రూ.98 కోట్లను కేటాయించాలని డివిజన్ అధికారులు మూడేళ్ల కిందట ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం ఒక్కపైసా కూడా కేటాయించలేదు. ప్రస్తుతం రూ.130 కోట్లు అవసరమని అధికారులు చెబుతున్నారు. గుత్తి ఉపకాలువకు హంద్రీనీవా కాలువ నుంచి అధికారికంగా నీటిని కేటాయించాలని ఇంజినీర్లు ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు ఆమోదం పొందలేదు. పూర్తి ఆయకట్టుకు ప్రభుత్వం నీటిని సరఫరా చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కేటాయింపుల కోసం ఎదురుచూస్తున్నాం

- వెంకటరమణ, ఈఈ, గుంతకల్లు డివిజన్

గుంతకల్లు బ్రాంచ్ కాలువ లైనింగ్ పనులు, గుత్తి ఉపకాలువ ఆధునికీకరణ పనులకు గత ప్రభుత్వం నాలుగేళ్ల నుంచి నిధులు కేటాయించలేదు. పనులు చేయకపోవడంతో కాలువలు అధ్వానంగా మారాయి. ముళ్లపొదల కారణంగా గుత్తి కాలువకు మరమ్మతులు చేయడం కష్టంగా మారింది. మరమ్మతులు చేయడానికి కూడా డివిజన్‌లో నిధులు లేవు. ప్రభుత్వ నిధుల కేటాయింపు కోసం ఎదురుచూస్తున్నాం.

నయనానందకరం.. దేవీ అలంకారం



గుత్తి: వేంకటేశ్వరస్వామి అలంకరణలో వాసవీమాత



గుంతకల్లు: మారెమ్మ ఆలయంలో అన్నపూర్ణేశ్వరిగా..



పామిడి: గాయత్రీదేవి అలంకరణలో వాసవీమాత



కల్లూరులో గాయత్రీదేవి అలంకరణలో..



శింగనమల: భగవతీదేవిగా అమ్మవారు



తాడిపత్రి: గాయత్రీ అలంకరణలో ..

అమ్మవారి ఆలయాల్లో దసరా నవరాత్రుల శోభ సంతరించుకుంది. శరన్నవ రాత్రులను పురస్కరించుకుని గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లో శనివారం అమ్మవార్ల ఆలయాల్లో విశేష పూజలు చేశారు. అమ్మవార్ల మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించి రోజూ ఓ రూపంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఆయా ఆలయాల్లో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు జరిగాయి. **- న్యూస్‌టుడే, బృందం**



తాడిపత్రి: చింతలరాయుని ఆలయంలో గజలక్ష్మీగా ఆనందవల్లి అమ్మవారు



గార్లదిన్నె: అన్నపూర్ణదేవి అలంకరణలో భ్రమరాంభదేవి



పెద్దపప్పూరు: అన్నపూర్ణదేవిగా చౌడేశ్వరీదేవి



యాడికిలో గాయత్రీదేవి అలంకరణలో పెద్దమ్మ



పెద్దవడుగూరు: క్రిష్టిపాడులో గాయత్రిదేవిగా చౌడేశ్వరి



పెద్దవడుగూరులో గాయత్రీదేవిగా ..



బుక్కరాయసముద్రం: అన్నపూర్ణదేవిగా..



గుంతకల్లు పట్టణం: కన్యకా పరమేశ్వరి



మాట్లాడుతున్న శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు

యాజమాన్య పద్ధతులు తప్పనిసరి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: జిల్లాలో రబీ వ్యవసాయ సీజన్‌లో వివిధ రకాల పంటలు సాగుచేసే రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా కేంద్రం అధిపతి విజయ్‌శంకర్‌బాబు తెలిపారు. శనివారం పరిశోధనా కేంద్రంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సమన్వయ సమావేశం నిర్వహించారు. రబీ పంటలు సాగుచేసే రైతులు పొలాన్ని దుక్కులు చేసుకుని ఎకరాకు 5 టన్నుల పశువుల ఎరువు పొలంలో వేసుకున్న తర్వాత ఆముదం, పత్తి, ఉలవ, పెసన, కొర్ర, జొన్న తదితర పంటలు వేసుకోవాలన్నారు. వ్యవసాయ అధికారుల సూచన మేరకు సకాలంలో పురుగుల మందులు పిచికారీ చేసుకుంటే మంచి దిగుబడులు పొందవచ్చని తెలిపారు. శాస్త్రవేత్తలు నారాయణస్వామి, రమేశ్‌నాయక్, లక్ష్మణ్, భార్గవి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

నూతన పరిపాలన భవనం ప్రారంభం

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లు శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో నూతనంగా నిర్మించిన పరిపాలన భవనాన్ని, యోగా మందిరాన్ని శనివారం మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్, ఆర్యవైశ్య సంఘం సభ్యులు ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యేను ఆర్య వైశ్య సంఘం సభ్యులు శాలువాలతో సత్కరించారు.

భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన ఓ వివాహిత భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పట్టణ సీఐ సాయిప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. కాలనీకి చెందిన భాస్కర్, భారతిల కుమార్తె శివజోత్స్న (23)కు, అదే కాలనీకి చెందిన నరేంద్రకు గతేడాది ప్రేమ వివాహం జరిగింది. వరకట్నం తీసుకురావాలని శివజోత్స్నను నరేంద్ర వేధించేవాడని, దీంతో ఆమె తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

కిందపడి భవన నిర్మాణ కార్మికుడి మృతి

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి పట్టణ పరిసరాల్లోని పోతులయ్యపాళెంలో భవన నిర్మాణ కార్మికుడు ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. గ్రామీణ సీఐ శివగంగాధర్‌రెడ్డి వివరాల మేరకు.. మండలంలోని కొట్టాలపల్లికి చెందిన షేక్షావలి (36) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. శనివారం పోతులయ్యపాళెంలో భవనంపై పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. గమనించిన తోటి కార్మికులకు హుటాహుటిన స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించి, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతిడికి భార్య ఫాతిమా, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో రైతు..

గార్లదిన్నె, న్యూస్‌టుడే: మండలంలోని తిమ్మంపేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో రాముడు (45) మృతిచెందగా, సుధాకర్ గాయపడినట్లు పోలీసులు తెలిపారు. పామిడి మండలం కండ్లపల్లికి చెందిన వీరిద్దరు ద్విచక్ర వాహనంపై గార్లదిన్నె నుంచి సొంత గ్రామానికి వెళ్తుండగా వాహనం అదుపుతప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం 108లో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాముడు మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

దైవ దర్శనానికి వెళ్లి.. తిరిగిరాని లోకాలకు

గార్లదిన్నె, న్యూస్‌టుడే: మండలంలోని కల్లూరుకు చెందిన సాయికుమార్‌రెడ్డి (26) గుండెపోటుతో శుక్రవారం రాత్రి మృతిచెందాడు. నంద్యాల జిల్లా అహోబిలం ఆలయానికి వెళ్లాడు. రాత్రి గుండెనొప్పి రావడంతో కుప్పకూలిపోయాడు. వెంటనే బంధువులు ఆసుపత్రికి తరలించేలోపు మృతిచెందాడు. చేతికొచ్చిన కుమారుడు ఆకస్మికంగా మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

వేధింపుల కేసులో ముగ్గురి అరెస్టు

గార్లదిన్నె, న్యూస్‌టుడే: మండలంలోని కోటంక గ్రామానికి చెందిన శోభ అనే వివాహిత వేధింపులు తాళలేక సెప్టెంబరు 11న ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో నిందితులుగా ఉన్న భర్త చిదానంద, మరిది దినేశ్, అత్త నాగేశ్వరమ్మలను గార్లదిన్నె సమీపంలో శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు శింగనమల సీఐ కౌలుట్లయ్య తెలిపారు.

ద్విచక్ర వాహనంలో నగదు చోరీ

నార్పల, న్యూస్‌టుడే: నార్పల మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంకు దగ్గర ఓ వ్యక్తి తన ద్విచక్ర వాహన బ్యాగులో ఉంచిన రూ.3 లక్షల నగదును గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళితే. . వెంకటాంపల్లికి చెందిన శ్రీనివాసులు, భార్య పద్మావతితో కలిసి వ్యవసాయ, కుటుంబ ఖర్చుల కోసం శనివారం నార్పల స్టేట్ బ్యాంకులో రూ.3 లక్షలు డ్రా చేశారు. నగదును తమ ద్విచక్ర వాహన బ్యాగులో ఉంచి పక్కనే ఉన్న దుస్తుల దుకాణంలోకి వెళ్లారు. అప్పటికే వీరిపై నిఘా ఉంచిన దుండగులు బ్యాగులోని నగదును అపహరించారు. శ్రీనివాసులు వచ్చి బ్యాగులో చూడగా నగదు లేదు. చుట్టుపక్కల గాలించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ కౌలుట్లయ్య ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. దుకాణాల్లో సీసీ కెమెరాలు పరిశీలించగా ఓ యువకుడు, మరో వ్యక్తితో కలిసి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. నిందితులను పట్టుకోవడానికి పోలీసులు విస్తృతంగా గాలింపు చేపట్టారు. గత కొన్ని రోజులుగా నార్పల మండల కేంద్రంలో వరుస చోరీలు జరుగుతుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

తాగునీటి ట్యాంకు నిరుపయోగం

కాలనీ వాసుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకులు సుమారు 20 దాకా నిరుపయోగంగా ఉన్నాయి. ఇది దోనిముక్కల జగనన్న కాలనీలోని దుస్థితి. బోర్లను తవ్వించి, నీటిని సరఫరా చేయడానికి 40 పైనా ట్యాంకులను ఏర్పాటు చేసింది. కొన్ని బోర్లు పనిచేయక, మరికొన్ని పైప్‌లైన్లు, కుళాయిలు లేకపోవడంతో ట్యాంకులు వృథాగా ఉన్నాయి. ఫలితంగా తాగునీటి కోసం కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై గృహనిర్మాణ సంస్థ డీఈఈ వెంకటేశులును వివరణ కోరగా.. బోర్లను మరమ్మతులు చేయిస్తామన్నారు. వినియోగంలోకి తెచ్చి కాలనీవాసులు ఇబ్బంది పడకుండా చూస్తామని తెలిపారు. **- న్యూస్‌టుడే, గుంతకల్లు**



కల్వర్టుకు గండి.. జాగ్రత్త వహించండి

పట్టణంలోని ప్రధాన మురుగు కాలువకు అంబమ్మగుడి కాలనీవద్ద నిర్మించిన సిమెంట్ నిర్మాణానికి గండి పడి ప్రమాదకరంగా మారింది. ఈ కాలువ మీదుగానే కాలనీవాసులు రాకపోకలు సాగిస్తున్నారు. పసిపిల్లలు కాలు జారి కాలువలో పడితే నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి ప్రమాదం ఉంది. రాత్రిళ్లు చూసుకోకపోతే ప్రమాదాల బారిన పడే అవకాశం లేకపోలేదు. దెబ్బతిన్న గండికి మరమ్మతులు చేయడంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కాలనీవాసులు విమర్శిస్తున్నారు. మున్సిపల్ ఏఈ హరికృష్ణను వివరణ కోరగా.. వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చూస్తామని తెలిపారు. **- న్యూస్‌టుడే, గుంతకల్లు**



చినుకు పడితే రోడ్లన్నీ చిత్తడే

పాత గుంతకల్లులోని అంకాలమ్మ గుడి, హమాలీ కాలనీల్లో సీసీరోడ్లు లేకపోవడంతో మట్టిరోడ్లతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్లలో గుంతల ఉండటంతో వర్షాలు వచ్చినప్పుడు నీరు నిలిచి చిత్తడిగా మారుతున్నాయి. దీంతో పాదచారులు నడవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మౌలిక వసతులు కల్పించాలని కాలనీవాసులు మున్సిపల్ అధికారులను కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ ఏఈ హరికృష్ణను వివరణ కోరగా.. గుంతలను పూడ్చి, సీసీరోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. **- న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం**



శిథిలావస్థలో పురపాలిక దుకాణాలు

గుత్తి, న్యూస్‌టుడే: గుత్తి పురపాలిక దుకాణ సముదాయాల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా వ్యాపార సముదాయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. 40 ఏళ్ల కిందట నిర్మించిన దుకాణ గదుల పైకప్పులు దెబ్బతిన్నాయి. గోడలు బీటలు వారాయి. లీజుకు తీసుకున్న వ్యాపారులు శిథిలావస్థలోని గదులతో అవస్థలు పడుతున్నారు. పురపాలిక అధికారులు నెలనెలా అద్దెలను వసూలు చేస్తున్నారే తప్పా మరమ్మతులు చేయించలేకపోతున్నారు. గుత్తిఆర్.ఎస్. లో పాత పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న గదులను 30 ఏళ్ల కిందట నిర్మించారు. వాటి నిర్వహణ కూడా అధ్వానంగా ఉంది. గదుల పైకప్పు కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. మెయిన్‌బజార్‌లోని గదులు కూడా శిథిలావస్థలో ఉన్నాయి. ఇటీవల ఓగది పైకప్పు కూలిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం వాటిల్లలేదు. గదులు కారుతున్నాయని, కూలిపోతున్నాయని వ్యాపారులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. గుత్తిఆర్.ఎస్.లో రంగనాయకులు అనే వ్యాపారి సొంతగానే గదికి మరమ్మతులు చేయించుకున్నారు. గుత్తిఆర్.ఎస్.లో మొత్తం 21 దుకాణాలు ఉన్నాయి. గుత్తిలో గాంధీచౌక్ నుంచి కోటకు వెళ్లే రహదారి ఇరువైపులా దుకాణ సముదాయాలున్నాయి. 20 ఏళ్ల కిందట లబ్ధిదారుల పథకం కింద సుమారు 15 గదులను నిర్మించారు. గదులు పాతపడ్డాయి. కొందరు వ్యాపారులే మరమ్మతులు చేయించుకుంటూ కాలం గడుపుతున్నారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న వ్యాపార దుకాణాలు కారుతున్నాయి. పురపాలికలో మొత్తం 78 గదులు ఉన్నాయి. ఏటా రూ.34 లక్షలు అద్దె కింద వస్తోంది. అద్దె వసూళ్లపై ఉన్న శ్రద్ధ గదులకు మరమ్మతులు చేయించే విషయంలో లేదని వ్యాపారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు. ఈ విషయమై డీఈఈ హేమచంద్రను వివరణ కోరగా.. దుకాణ సముదాయాలకు మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.



గుత్తిఆర్.ఎస్.లోని దుకాణ సముదాయం

అంజన్న సన్నిధిలో జ్ఞానానందగిరిస్వామీజీ

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే: కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామిని శనివారం తోగట వార క్షత్రియ కులగురువు శ్రీదివ్య జ్ఞానానందగిరి (పుష్పాండజ మహర్షి గురుపీఠం దొడ్డబళ్లాపూర్) దర్శించుకున్నారు. ఆలయ ఈవో కె.వాణి, ఆలయ అనువంశిక ధర్మకర్త సుగుణమ్మ స్వామీజీకి ప్రసాదాలు అందజేశారు.

మట్కా స్థావరాలపై దాడులు


పామిడి : కొత్తబస్టాండ్ సమీపంలో ఇద్దరు మట్కా నిర్వాహకులను అరెస్టు చేసినట్లు సీఐ యుగంధర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.10,050 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. **గుత్తి:** స్థానిక దళిత వాడలో బీటర్లపై శనివారం పోలీసులు దాడులు చేశారు. కృష్ణప్రసాద్, బాలముని, తిరుమలేశ్‌లు మట్కాచీటీలు రాస్తుండగా ఎస్ఐ సురేశ్ సిబ్బందితో దాడిచేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.40,200 నగదును స్వాధీనం చేసుకున్నారు.

చోరికి గురైన స్టార్టర్ల అందజేత

గార్లదిన్నె, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో రైతులు పంపు సెట్లకు అమర్చిన విద్యుత్తు స్టార్టర్లు చోరికి గురికావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై గౌస్‌బాషా సిబ్బందితో స్టార్టర్ల స్వాధీనంపై ప్రత్యేక దృష్టి సారించారు. ఎట్టకేలకు అనుమానం ఉన్న వ్యక్తుల నుంచి వివరాలు ఆరా తీయగా గుజరి వ్యాపారం నిర్వహించే వారు కొంటున్నారని తెలుసుకున్నారు. వారి వద్ద నుంచి పది స్టార్టర్లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం శింగనమల సీఐ కౌలుట్లయ్య చేతులమీదుగా రైతులకు అందజేశారు.

రైల్వే పోలీసులకు పురస్కారాలు

గుంతకల్లు, న్యూస్‌టుడే: ఓ కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేసిన ఘటనకు సబంధించి రైల్వే పోలీసులు రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు నుంచి శనివారం నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందుకున్నారు. అప్పటి రైల్వే ఎస్పీ చౌడేశ్వరి, ప్రస్తుత గుంతకల్లు రైల్వే ఎస్పీ రాహుల్ మీనా, రైల్వే సీఐ నగేశ్‌బాబు బహుమతులు అందుకున్నారు. మార్చిలో తిరుపతి నుంచి అనంతపురానికి వస్తున్న విజయలక్ష్మి మెడలోని బంగారు గొలుసును లాక్కున్న దుండగులు, ఆమెను వాయలపాడు రైల్వేస్టేషన్ సమీపంలో కిందకు తోసేయడంతో తీవ్రంగా గాయపడింది. కదిరి రైల్వే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన గ్యాంగ్‌ను పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. సంచలనం సృష్టించిన కేసులను ఛేదించిన పోలీసులకు అవార్డులు ఇవ్వాలని ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు 16 సంఘటనలు ఎంపిక కాగా మూడో సంఘటనగా వాయలపాడుకు చెందిన కేసును ఎంపిక చేసి డీజీపీ చేతుల మీదుగా రూ.40 వేలు నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలను అందజేసినట్లు సీఐ నగేశ్‌బాబు తెలిపారు.



డీజీపీ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న రైల్వే ఎస్పీ రాహుల్ మీనా, పక్కన అప్పుడు ఎస్పీగా ఉన్న చౌడేశ్వరి

వాగులో ఇరుక్కున్న నూర్పిడి యంత్రం

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: మండలంలోని వీరన్నపల్లి సమీపంలోని పుల్లేటి వాగు వర్షాలకు ఉద్ధృతంగా ప్రవహించడంతో దాటుకునే ప్రయత్నం చేసిన నూర్పిడియంత్రం ట్రాక్టర్ ఇరుక్కుపోయింది. ఈ ఘటన శనివారం చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి మండలంతోపాటు పైతట్టు ప్రాంతాల్లో వర్షాలు అధికంగా కురవడం వల్ల పుల్లేటి వాగు ప్రవహించింది. వాగులోని దారిలో అటువైపు వెళ్లవచ్చునని చిత్రచేడుకు చెందిన రాము నూర్పిడియంత్రం ట్రాక్టర్‌తో మధ్యలోకి వెళ్లాక గుంతలో ఇరుక్కుపోయింది. దీంతో నీటి ప్రవాహం అధికమై వారు నీటిలోనే ఉండాల్సి వచ్చింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఉషారాణి, ఎస్సై చిన్నరెడ్డెప్ప ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ముందుగా నూర్పిడియంత్రంపై ఉన్న వ్యక్తులను రక్షించారు. గ్రామస్థుల సహకారంతో పొక్లెయిన్ సాయంతో ట్రాక్టర్‌ను బయటకు తీసుకొచ్చారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.



నీటమునిగిన ట్రాక్టర్

అనంతపురం

●అనంతపురం ●రాప్తాడు

దసరా సెలవులకు సొంతూరు వెళ్తున్నారా?

అనంత నేరవార్తలు: దసరా సెలవులకు సొంతూళ్లకు వెళ్తున్నారా? తస్మాత్ జాగ్రత్త. తాళం వేసిన ఇళ్లలో చోరీలు జరిగే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. దొంగతనాలను అరికట్టడానికి లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్ఎంఎస్)ను వినియోగించుకోవాలని సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ పేర్కొన్నారు. శనివారం ప్రకటనలో ఆయన సూచిస్తూ.. డబ్బు, విలువైన ఆభరణాలు ఇంట్లో ఉంచి వెళ్లకూడదని, రాత్రివేళ అనుమానాస్పదంగా సంచరించే వారి గురించి పోలీసులకు వెంటనే సమాచారం అందించాలన్నారు. తాళం వేసిన ఇళ్లను అపరిచిత వ్యక్తులు ఉదయం వేళ వెతికి తిరుగుతుంటే అప్రమత్తంగా ఉండాలని, విలువైన వస్తువులను పక్కింటి వారికి ఇచ్చి నమ్మి మోసపోవద్దన్నారు. ఇరుగు పొరుగు వారిని తమ ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పి వెళ్లడం మంచిదన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి పోరాటం

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్న, అశోక్‌లు పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు అనంతపురం నగరంలోని అంబేడ్కర్ భవనంలో ప్రారంభమయ్యాయి. ఈ నెల 8 వరకు జరిగే ఈ వర్క్‌షాప్‌లో విద్యారంగం సమస్యలు.. పరిష్కారాలపై చర్చిస్తామన్నారు. శనివారం జరిగిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ హాజరై మాట్లాడారు. భాజపా తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం విధానం వల్ల దేశంలో ప్రాథమిక విద్య పూర్తి స్థాయిలో నాశనమైందన్నారు.

లేఖ రచనపై పోటీలు

అరవిందనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: విద్యార్థుల్లో లేఖ రచన పెంపొందించేందుకు తపాలాశాఖ ఢాయ్ అఖర్ లెటర్ పోటీలు నిర్వహిస్తోంది. ఈ పోటీల్లో పాల్గొనాలని ఆసక్తి కలిగిన విద్యార్థులు, విద్యార్థులు వివిధ పాల్గొనాలని తపాలాశాఖ అనంతపురం డివిజన్ ఎస్పీ గుంపస్వామి సూచించారు. పోటీలు ఇంపార్టెన్స్ ఆఫ్ లెటర్స్ ఇన్ ఏ డిజిటల్ ఏజ్ అంశంపై ఉంటుంది. విజేతలకు జాతీయ స్థాయిలో రూ.50 వేలు, రూ.25వేలు, రూ.10 వేలు నగదు బహుమతి అందిస్తారు. రాష్ట్ర స్థాయిలో విజేతలకు రూ.25, రూ.15, రూ.5 వేలు బహుమతి ఇస్తారని ఆయన వివరించారు. వివరాలకు మీ సమీప పోస్టాఫీసు కార్యాలయాల్లో సంప్రదించాలని డివిజన్ ఎస్పీ గుంపస్వామి విద్యార్థులను కోరారు.

గ్రంథాలయానికి పాత పుస్తకాల వితరణ

అనంత సంక్షేమం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ చదువులు పూర్తి అయిన తర్వాత, వారికి అవసరం లేదు అనుకుంటే గ్రంథాలయాలకు అందిస్తే ప్రయోజనం ఉంటుందని పలువురు పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయానికి నగరానికి చెందిన ఉద్యోగి జయశంకర్‌రెడ్డి తన వద్ద ఉన్న రూ.85 వేల విలువ చేసే పుస్తకాలను జిల్లా కేంద్ర గ్రంథాలయానికి ఉచితంగా అందజేశారు. పోటీ పరీక్షల సన్నద్ధం అయ్యే విద్యార్థులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో వాటిని అందజేశామన్నారు.

స.హ.చట్టంపై పరిశోధన

ఎస్కేయూ, న్యూస్‌టుడే: సమాచార హక్కు చట్టంపై శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం న్యాయశాస్త్ర విభాగంలో పూజారి వెంకటరావు పరిశోధన చేశారు. ఆచార్య హైదర్‌వలి పర్యవేక్షణలో ఆయన 'సమాచార హక్కు చట్టం, సుపరిపాలన విశ్లేషణ' అనే అంశంపై పరిశోధన చేశారు. ఆయన పరిశోధనకు ఎస్కేయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. మడకశిర న్యాయస్థానంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఆయన పనిచేస్తున్నారు.

యూహెచ్‌ఎల్‌ఎఫ్ ప్రధాన కార్యదర్శిగా ఆనంద్‌కుమార్

ఎస్కేయూ, న్యూస్‌టుడే: యునైటెడ్ హిస్టరీ లెక్చరర్స్ ఫెడరేషన్ (యూహెచ్ఎల్ఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జెన్నె ఆనంద్‌కుమార్ నియమితులయ్యారు. యూహెచ్ఎల్ఎఫ్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఇటీవల ఎన్నుకున్నారు. అనంత జిల్లాకు చెందిన జెన్నె ఆనంద్‌కుమార్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎంపిక కావడం విశేషం. ఆయన నార్పల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్నారు. జిరసం అధ్యక్షులుగా కూడా ఉన్నారు. ఆయన ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

మధ్యంతర భృతికి డిమాండ్

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: దసరా పండగ కానుకగా ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి ప్రకటించాలని పాఠశాల సహాయకుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 12వ పీఆర్సీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం జారీ చేసిన 117 జీవో రద్దు చేయాలన్నారు. 3, 4, 5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలల్లో కలపాలన్నారు.

'అక్కినేని కుటుంబానికి క్షమాపణ చెప్పాలి'

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే : తెలంగాణ మంత్రి కొండ సురేఖ అక్కినేని కుటుంబానికి క్షమాపణ చెప్పాలని అక్కినేని అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఏ సెవెన్ కన్వెన్షన్ హాలులో ఆయన సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. రాజకీయ విమర్శల కోసం సినీ కుటుంబాన్ని వ్యక్తిగతంగా మాట్లాడటం ఏంటని ప్రశ్నించారు.

తెరపై ఈనాడు

కమలానగర్, న్యూస్‌టుడే : గంగ : **సత్యం సుందరం,** గాయత్రి : **రామ్‌నగర్ బన్నీ,** గౌతమి : **కలి, మిస్టర్ సెలబ్రిటీ,** గౌరి, త్రివేణి, ఎస్వీ సినిమాక్స్, నీలిమ : **దేవర,** తరంగిణి : **దక్షిణ,** తేజస్విని : **స్వాగ్.**

చూడ చూడ దారులు.. దారుణాలు



సోమనాథనగర్ వంతెన వద్ద చెరువుల రోడ్డు

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: అర కిలోమీటరు రోడ్డు. ఈ కొద్ది దూరం దాటాలంటే నరకమే. వాహనదారులకు ఒళ్లు అంతా హూనం కావాల్సిందే. కొద్దిపాటి వర్షం వస్తే చాలు రోడ్లన్నీ గుంతలమయమే. ఏ గుంత ఎంతలోతుందో తెలియక సతమతం కావాల్సిందే. అనంతపురం నగరంలోని సోమనాథనగర్ వంతెన నుంచి మధ్యలో కోదండ రామాలయం (సోమనాథనగర్ ఆటో సర్కిల్) మీదుగా యువజన కాలనీ నుంచి వచ్చే చిన్న వంతెన వరకు వాహనాల్లో వెళ్లలేని దయనీయ పరిస్థితి ఉంది.

● తపోవనం కూడలి నుంచి నగరంలోకి రాకపోకలు సాగించే మార్గం ఇది. నారాయణపురం పంచాయతీ, తపోవనం, బైపాస్ మీదుగా వెళ్లే వారు, సోమనాథనగర్, రజకనగర్, యువజనకాలనీ, నగరంలోకి వచ్చే వారందరికి నిత్యం 50 వేల మందికి పైగానే ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. వాహనాల తాకిడికి రోడ్డు మరింత ఛిద్రం అవుతున్నా నగరపాలక పాలక ఏమాత్రం పట్టించుకోవడం లేదు. రెండేళ్ల క్రితం వచ్చిన వరదల వల్ల సోమనాథనగర్ వంతెన కొట్టుకుపోయింది. అప్పట్లో కొత్త వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. శాంతినగర్ బోర్డు నుంచి వంతెన వరకు ఎన్నికల కంటే నెల రోజుల ముందు హడావిడిగా పూర్తి చేశారు. అంతటితో పని ఆపేశారు. వంతెనతోపాటు రోడ్డు పూర్తి చేయాలని గతంలో రూ.30 లక్షలతో ప్రతిపాదించారు. వంతెన నిర్మాణం చేయడానికి ఆలస్యం అయ్యే అవకాశం ఉండటంతో కనీసం రోడ్డునైనా బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఐదు నిమిషాల వర్షానికే

మూడు రోజుల నుంచి కురుస్తున్న జల్లులకు గుంతల్లోకి నీరు వచ్చి చేరింది. ద్విచక్ర వాహనాల్లో వెళ్లాలంటే ఇబ్బంది పడాల్సిందే. అర కిలోమీటరు లోపు ఉన్న ఈ మార్గంలో ఐదు అడుగుల వెడల్పుతో 10 గోతులు, ఓ మోస్తరు ఉన్నవి 30 దాకా, చిన్నపాటి గుంతలు లెక్కలేనన్ని ఉన్నాయి. కనీసం గోతులు పూడ్చినా కొంతవరకు ఇబ్బంది తొలగే అవకాశం ఉన్నా అధికారులు ఆలోచించడం లేదు.

తటాకం కాదిది రోడ్డే



రాంనగర్‌లోని ప్రధాన కూడలి కొద్దిపాటి తటాకాన్ని తలపిస్తోంది. నాలుగు వైపులా వెళ్లే కూడలిలో పెద్ద గుంత పడింది. వాహనాల్లో వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నిత్యం పరిసర ప్రాంత వాసులు, ఇతర ప్రాంతాల వారు ఇదే మార్గంలోనే వెళ్లాల్సి ఉంటుంది. పలువురు మహిళలు తమ పిల్లలను పాఠశాలలకు ద్విచక్రవాహనంలో తీసుకెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. రోడ్డు మధ్యలోనే కాకుండా ఇదే మార్గం మీదుగా పాత ఆర్టీఓ రోడ్డుపైపుకు వెళ్లే రోడ్డు దారుణంగా మారింది. వర్షం వస్తే వారాల తరబడి నీరు నిలబడి ఉంటుంది.



జిల్లా కేంద్రం నుంచి కనగానపల్లి మండలం తొగరగుంట గ్రామం రోడ్డు దుస్థితి ఇలా..

- న్యూస్‌టుడే, ఆత్మకూరు

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM to 1 PM)

అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005, రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003



సమస్య : అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద మురుగు కాలువలు అధ్వానంగా ఉన్నాయి. పిచ్చి మొక్కలు వెలిశాయి. కాలువ శుభ్రం చేసి, మరమ్మతులు చేయండి.

- శేషమ్మ, స్థానికురాలు.

సమాధానం : వెంటనే కాలువ శుభ్రం చేయించి, మరమ్మతులు చేయిస్తాం. **- విష్ణుమూర్తి, నగరపాలక ఎంహెచ్ఓ.**

- న్యూస్‌టుడే, అనంతపురం(కమలానగర్)

చెత్తను శుభ్రం చేసి..

ఈనాడు కథనానికి స్పందన

అనంతపురం(కమలానగర్), న్యూస్‌టుడే : హౌసింగ్ బోర్డు కాలనీలో ఏ వీధి చూసిన చెత్తా చెదారంతో దర్శనిస్తున్నాయి. ఈ అంశంపై ఈనాడులో 5వ తేదీన చెత్తను తరలించండి శీర్షికన ఇచ్చిన చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. చెత్తను తరలించి దుర్వాసన రాకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

'శ్రమిద్దాం.. పార్టీని అగ్రస్థానంలో నిలుపుదాం'



మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్, చిత్రంలో ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ తదితరులు

అనంతపురం (కళ్యాణ దుర్గంరోడ్డు), న్యూస్‌టుడే: తెదేపా సభ్యత్వం నమోదు కోసం రాష్ట్రంలో ఐదు నియోజకవర్గాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారని, పార్టీ సభ్యత్వం నమోదులో అంతా కలిసికట్టుగా పనిచేసి మొదటి స్థానంలో నిలపాలని తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. సభ్యత్వం నమోదుపై శనివారం అనంతపురం నగరం రాయల్ ఫంక్షన్ హాలులో నియోజకవర్గ పరిశీలకుడు లక్ష్మీనారాయణతో కలిసి తెదేపా శ్రేణులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ..సభ్యత్వం నమోదుకు చేసుకున్న కార్యకర్తలు, నాయకులకు ప్రమాద బీమా రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ.. తెదేపాలో గ్రూపు రాజకీయాలు ఉన్నట్లు కొంతమంది ప్రచారం చేస్తున్నారని, అర్బన్‌లో ఉన్నది ఒక్క తెదేపా గ్రూపేనన్నారు. సభ్యత్వం నమోదుకు డివిజన్‌కు ఇద్దరు, పంచాయతీకి నలుగురు చొప్పున ఇన్‌ఛార్జుల నియమించామని ఈనెల 9న సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు.

'విజ్ఞాన శాస్త్రం మానవాళికి ఉపయోగపడాలి'

ఎస్కేయూ, న్యూస్‌టుడే: విజ్ఞాన శాస్త్రాన్ని మానవాళికి ఉపయోగపడేలా విద్యార్థులు కృషి చేయాలని ఎస్వీ డిగ్రీ కళాశాలల వైఎస్ ఛైర్మన్ చక్రధర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో శనివారం ప్రాంతీయ స్థాయి సాంకేతిక విద్యా సదస్సు జరిగింది. ఆయన సదస్సు ప్రారంభోత్సవం చేశారు. విద్యార్థులు వినూత్న ఆలోచనలతో ముందుకెళ్లాలన్నారు. ప్రధాన వక్తగా హాజరైన ఎస్కేయూ ఆచార్యులు మురళీధర్ రావు మాట్లాడుతూ.. విజ్ఞాన శాస్త్రాన్ని పూర్తి స్థాయిలో అందిపుచ్చుకోవాలన్నారు. జీవ సాంకేతికశాస్త్రం, ఆహార సాంకేతికశాస్త్రం, రసాయనశాస్త్రాల్లో నూతన ఆవిష్కరణలకు విద్యార్థులు కృషి చేయాలన్నారు.

పల్లెకు పరుగో.. పరుగు

దసరా పండగ దగ్గర పడే కొద్దీ ప్రయాణికులకు నిరీక్షణ తప్పడం లేదు. శనివారం ప్రయాణికులతో అనంతపురంలోని ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణం కిక్కిరిసింది. దసరా దగ్గర పడుతుండటంతో పలు ప్రాంతాలకు చెందిన వారు స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. మరోవైపు కొన్ని కళాశాలలకు సెలవులు రావడం, శనివారం కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీగా మారింది. దసరా పండగ సందర్భంగా వలస వెళ్లినవారు, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు, ఉపాధి పొందే వారితో పాటు విద్యార్థులు ఇళ్లకు చేరుకుంటున్నారు. అనంతపురం జిల్లా కేంద్రం కావడంతో పలు ప్రాంతాల వారు ఇక్కడకు చేరుకొని ఉమ్మడి జిల్లాలోని పలు పట్టణాలకు అటు నుంచి గ్రామాలకు వెళ్లాల్సి ఉంటుంది. సాధారణ రోజుల్లో ఉన్న బస్సులే ఉండటంతో అధిక సంఖ్యలో ఉన్న ప్రయాణికులు సమయానికి బస్సులు లేక ఇబ్బందులు పడ్డారు. **- న్యూస్‌టుడే, అనంతపురం ఆర్టీసీ**



బస్సుల కోసం పరుగులు తీస్తున్న ప్రయాణికులు



బస్టాండ్‌లో బస్సులు రాక వేచిచూస్తూ..

పొంచి ఉన్న ప్రమాదం



రుద్రంపేట పంచాయతీ పరిధి జాతీయ రహదారి నంబర్-44 సమీపంలో చైతన్య స్కూల్‌కు వెళ్లే ప్రధాన రహదారి సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉంది. విద్యుత్తు స్తంభం చుట్టూ మట్టి తొలగించడంతో ప్రమాదం పొంచి ఉంది.

- న్యూస్‌టుడే, రుదంపేట

మట్టి దిబ్బలిలా.. ఆహ్లాదం ఎలా?

రాంనగర్‌లోని సిద్ధార్థ ఉద్యానానికి రెండు వైపులా చెత్తాచెదారం పేరుకుపోయింది. ఓ వైపు మట్టి దిబ్బ పది రోజులుగా ఉన్నా నగరపాలక అధికారులు తొలగించలేదు. మరోవైపు సంచులు, చెత్త అంతా ఉంది. ఉద్యానంలోకి వెళ్లాలంటే మట్టి దిబ్బ, చెత్తను దాటాల్సిందే. ఇటీవల రూ.23 లక్షల వరకు వెచ్చించి ఆధునికీకరించారు. ప్రవేశ ద్వారం వద్దే అపరిశుభ్రత ఉండటంతో అసౌకర్యానికి లోనవుతున్నారు.

- న్యూస్‌టుడే, అనంత నగరపాలక



చెట్టు కొమ్మలు తరలించండి



రెండో రోడ్డు గాయత్రి ఇంగ్లీష్ మీడియం పాఠశాల వద్ద చెట్టు కొమ్మలు ఇబ్బందిగా మారాయి. విద్యుత్తు తీగలకు అడ్డు వస్తున్నాయని మూడు రోజుల క్రితం అధికారులు చెట్టు కొమ్మలను తొలగించారు. వాటిని తరలించకుండా రోడ్డు సమీపంలోనే పడేశారు. వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు.

- న్యూస్‌టుడే, అనంతపురం(బళ్లారిరోడ్డు)

ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం ముఖ్యం

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: గ్రామాల్లో అధికారికంగా నిర్వహించే ఏ కార్యక్రమమైనా ప్రజా ప్రతినిధులను తప్పకుండా పిలవాలని ఎంపీడీఓ దివాకర్ ఆదేశించారు. గ్రామ కార్యదర్శులు ప్రొటోకాల్ విషయంలో అన్ని జాగ్రత్తలు పాటించకపోతే తగిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. శనివారం మండల ప్రజాపరిషత్తు సర్వసభ్య సమావేశం ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన జరిగింది. జడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, ఈఓఆర్డీ వెంకటనాయుడు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ దివాకర్ మాట్లాడుతూ మండలంలో అధికారులందరికీ బదిలీలు జరిగాయి. కొత్తగా బాధ్యతలు చేపట్టిన వారంతా ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలన్నారు. జడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్ మాట్లాడుతూ గ్రామసభలు నిర్వహణలో సమయం పాటించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కక్కలపల్లి మూడురోజుల క్రితం జరిగిన గ్రామసభ నిర్దేశించిన సమయానికి కాకుండా అధికారులకు ఇష్టమైన సమయంలో నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

నిధుల వినియోగంలో వేగం పెరగాలి

అనంత నగరపాలక: 15వ ఆర్థిక సంఘం ద్వారా మంజూరైన నిధుల వినియోగంలో వేగం పెరగాలని పురపాలక ఆర్డీ విశ్వనాథ్ పేర్కొన్నారు. శనివారం అనంతపురంలోని పురపాలక ప్రాంతీయ సంచాలకుల కార్యాలయంలో కమిషనర్లు, ఇంజినీర్లు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. నగర, పురపాలికల్లో ఆస్తి పన్ను వసూళ్లను మార్చి వరకు నిర్లక్ష్యంగా ఉండి చివరలో ప్రజలపై ఒత్తిడి పెంచకుండా ఇప్పటి నుంచే ప్రణాళిక ప్రకారం వసూళ్లు చేయాలన్నారు. నివాసాల నుంచి సేకరించిన చెత్తను ఎప్పటికప్పుడు సంపద రూపంలో మార్పు చేసుకోవాలన్నారు. ఎక్కువగా నిల్వ ఉండకూడదన్నారు. ప్రజలు నుంచి వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించాలని సూచించారు.



ఆత్మకూరు: కన్యకా పరమేశ్వరి అమ్మవారు



తపోవనం గాయత్రీదేవి ఆలయంలో..



పాతూరు అమ్మవారిశాలలో..



కొత్తూరు అమ్మవారిశాలలో..



ఉమానగర్‌లో విత్తనాలతో అలంకారం

జగదీశ్వరికి భక్తజనుల జేజేలు



శివకోటి శ్రీపీఠంలో శ్రీవైష్ణవి దేవి అలంకారం

జగదీశ్వరి దేవతామూర్తికి భక్తజన కోటి జేజేలు పలుకుతున్నారు. దేవీ నవరాత్రులను పురస్కరించుకొని శనివారం అనంతపురం నగరం పలు ఆలయాల్లోని దేవతామూర్తులను నేత్రానందంగా అలంకరించారు. మూడో రోజు పలు ఆలయాల్లో పూజలు, అభిషేకాలు, అలంకారాలతో ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఒక్కో ఆలయంలో ఓ తరహాలో అమ్మవారిని అలంకరించారు. పాహిమాం. . రక్షమాం అంటూ అమ్మవారిని వేడుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, లలిత సహస్రనామ స్తోత్రాలు ఆకట్టుకున్నాయి.



రైల్వేఫీడర్ రోడ్డులో.. సింహవాహనం మీద శ్రీవారు

- న్యూస్‌టుడే, అనంత సాంస్కృతికం

ఎస్సీ వర్గీకరణ సాధనలో జిల్లా పాత్ర కీలకం

రుద్రంపేట, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ సాధనలో అనంతపురం జిల్లా మాదిగల పాత్ర కీలకమైనదని మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి బిక్షాలు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో జిల్లా నుంచి తెలబండ్ల రవి, ప్రభాకర్ ఆత్మబలిదానం చేసుకున్నారని ఆయన గుర్తు చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేసి ఎస్సీ జాబితాలోని అన్ని ఉపకులాలకు సామాజిక న్యాయం చేస్తానని మాదిగలకు ఇచ్చిన హామీని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమేష్ అధ్యక్షతన జరిగిన ఎంఈఎఫ్ ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణను రాష్ట్రంలో ఇంకా ముందుకు అడుగు పడలేదన్నారు. చంద్రబాబుపై మాదిగలకు గౌరవం, నమ్మకం ఉన్నాయన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



కార్మికులకు దుస్తులు పంపిణీ చేసిన తెదేపా నాయకుడు మధురాయల్

అనంతపురం (కళ్యాణదుర్గం రోడ్డు), న్యూస్‌టుడే : వార్డు సచివాలయ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులు దసరా పండుగ సంతోషంగా జరుపుకోవాలని తెదేపా నాయకుడు, కార్పొరేట్ భర్త నలుబోలు మధురాయల్ కోరారు. అనంతపురం నగరం 40, 58 డివిజన్ల పరిధిలోని సచివాలయ ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులకు మొత్తం 96 మందికి శనివారం ఆజాద్ నగర్‌లోని నివాసం వద్ద ఉచితంగా దుస్తులు పంపిణీ చేశారు.

పాలవాయిలో శుద్ధజల కేంద్రం ప్రారంభం

రాప్తాడు: రాప్తాడు మండలం పాలవాయిలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను శనివారం ధర్మవరపు మురళి ప్రారంభించారు. గ్రామంలో బోర్లలో నీరు రాక.. కొత్త బోర్లు వేసినా నీరు పడక పోవడంతో గ్రామస్థులు తాగునీటికి చాలా ఇబ్బంది పడ్డారు. దీంతో అక్కడ శుద్ధజల కేంద్రం ప్రారంభించి 20 లీటర్లు రూ.2 అందిస్తున్నారు. గ్రామస్థులు హర్షం వ్యక్తం చూస్తూ ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరపు మురళికి కృతజ్ఞతలు తెలియజేశారు.



సింగంపల్లిలో సాగు చేసిన వరి



మరువ పారుతున్న చెరువు

నాడు బీడు భూములు.. నేడు పచ్చని పైర్లు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండలంలోని సింగంపల్లిలో 2015కి మునుపు సాగు నీరు లేక రైతులు గ్రామం వదిలి ఉపాధి కోసం వలసలు వెళ్లారు. తెదేపా ప్రభుత్వం అధికారంలో వచ్చిన అనంతరం హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేసేందుకు పనులు ప్రాంభించింది. 2015 తరువాత హంద్రీనీవా నీరు కాలవకు వచ్చి అక్కడ నుంచి సింగంపల్లి చెరువుతో పాటు మండలంలోని అన్ని చెరువులకు నీరు చేరింది. వలసలు వెళ్లిన రైతులు తిరిగి గ్రామానికి తిరిగి వచ్చి పంటలు సాగు చేస్తున్నారు. గత ఏడాది నీరు లేక రైతులు ఇబ్బంది పడ్డారు. గత కొద్దిరోజుల క్రితం వచ్చిన హంద్రీనీవా నీటితో తిరిగి చెరువు నింపగా రైతులందరూ పెద్దఎత్తున వరి పంట సాగుకు ఉపక్రమించడంతో పొలాల్లో పచ్చదనం పరచుకుంది.

కుష్ఠు, క్షయ నివారణపై అవగాహన కల్పించండి

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: కుష్ఠు, టీబీ వ్యాధులపై ప్రజల్లో ఉన్న అపోహలను పోగొట్టేందుకు ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఈ.బి.దేవి తెలిపారు. శనివారం అనంతపురంలోని జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయంలో మెడికల్ ఆఫీసర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కుష్ఠు, టీబీ నయం కావనే అపోహలో కొంతమంది ఉన్నారని తెలిపారు. వైద్యులు సూచనల మేరకు కొంతకాలం మందులు వాడితే నయం అవుతాయన్న విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని తెలిపారు.

పండమేటి రాయుడు పార్కుకు పూర్వ వైభవం



పిచ్చిమొక్కలతో నిండిన పార్కును శుభ్రం చేస్తూ..

రాప్తాడు, న్యూస్‌టుడే : రాప్తాడు మండల కేంద్రంలోని పండమేటి రాయుడు పార్కుకు పూర్వవైభవాన్ని తీసుకొస్తామని రాప్తాడు మండల ఇంచార్జి ధర్మవరపు మురళి అన్నారు. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పండమేటి రాయుడు పార్కును వినియోగంలోకి తీసుకురావడానికి శుక్రవారం ఆయన పరిశీలించారు. తెదేపా ప్రభుత్వ హయంలో పరిటాల సునీత ఏర్పాటు చేసిన పార్కును గత వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు పట్టించుకోకపోవడంతో పార్క్ పిచ్చి మొక్కలుతో నిండిపోయింది. లక్షల వ్యయంతో నిర్మించిన పార్కును గాలికొదిలేశారు. స్పందించిన ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరపు మురళి పార్కులోని కంపచెట్లు, పిచ్చి మొక్కలను తొలగించి పార్కును ప్రజలకు అందుబాటులోనికి తీసుకురావడానికి శ్రీకారం చుట్టారు.



ఫౌంటెన్ పరిశీలిస్తున్న ధర్మవరపు మురళి

సంతోషంగా ఉంది..

రాప్తాడులో పిల్లలు, పెద్దలు ఆహ్లాదంగా గడపడానికి పార్క్ లేదు పండమేటి రాయుడు పార్కును అందుబాటులోకి వస్తే సాయంకాలం, సెలవు రోజుల్లో పార్క్‌లో చిన్నారులు, పెద్దలకు మంచి వాతావరణంలో గడపవచ్చు. **- నాగమణి, రాప్తాడు**